RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri
CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :32 సంచిక : 13 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: గురువారం 20-08-2026 పేజీలు : 12 వెల: 1-00

## దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



**ఖమ్మం, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో బుధవారం అర్హులైన 12 మిగతా 2లో..

## కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు..

## విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ

- దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందన్న ఖర్గే
- ప్రముఖ విద్యాసంస్థలన్నీ ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆరోపణ
- కేంద్రం నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపై నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19 (ఆర్ఎన్ఎ):** ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందని, ప్రముఖ విద్యాసంస్థలన్నీ క్రమంగా ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆయన ఆరోపించారు. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ పరీక్షల కుంభకోణాలే స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా యువత లేవనెత్తిన అసలైన సమస్యలకు సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని ఖర్గే విమర్శించారు. యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ 'విద్య నుంచి ఉపాధి వరకు రోడ్‌మ్యాప్'ను రూపొందించాల్సి ఉందన్నారు. అలాగే అయోధ్య రామాలయం విరాళాల చోరీ వివాదంపై స్పందిస్తూ, నిధుల గోల్‌మాల్‌పై నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులను జవాబుదారీ చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

- బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లగలగాలి
- వారి ఆదాయం పెంచడంలో భాగస్వామ్యం కావాలి
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి సూచన




**హైదరాబాద్, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో ఈ మేరకు కీలక సూచనలు చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల మిగతా 2లో..

## నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

### సంస్కరణలపై సుప్రీంలో విచారణ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19 (ఆర్ఎన్ఎ):** నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో మిగతా 2లో..

## సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం

### ప్రజలతో మమేకమే లక్ష్యంగా పీఏసీ సమావేశం



**నిజామాబాద్, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా కేంద్రంలోని దుబ్బలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కాంగ్రెస్ పీఏసీ సమావేశం జరిగింది. సమావేశానికి మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, గ్రామస్థాయి నుంచి పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్న డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్ రావు, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్, నిజామాబాద్ కార్పొరేషన్ అర్బన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, కామారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, పీఏసీ సభ్యులు, డీసీసీ నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం, ప్రజలతో మమేకమే లక్ష్యంగా ఈ సమావేశం విజయవంతంగా ముగిసింది.

## బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు

### నటి నిధి అగర్వాల్‌కు ఇడి ప్రశ్నలు



**హైదరాబాద్, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌కు సంబంధించిన కేసులో సినీ నటి నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన విచారణలో ఆమె ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ప్రమోషనల్ కార్యక్రమాలకు సంబంధించి కుదుర్చుకున్న కాంట్రాక్టులు, వాటి కాలపరిమితి, ప్రచారం కోసం అందించిన కంటెంట్, సోషల్ మిగతా 2లో..

## అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా 60 కి.మీ. చొరబాటు

### ఖండించిన కేంద్ర మంత్రి రిజిజు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19 (ఆర్ఎన్ఎ):** అరుణాచల్ ప్రదేశ్‌లోకి చైనా సైన్యం 60 కిలోమీటర్ల మేర చొచ్చుకొచ్చిందంటూ వస్తున్న వార్తలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. ఈ కథనాలు పూర్తిగా వాస్తవ విరుద్ధమని స్పష్టం చేశారు. అరుణాచల్‌లోని అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో వాస్తవాధీన రేఖను దాటి చైనా సైనికులు లోపలికి వచ్చినట్లు స్థానికులు ఆరోపించిన నేపథ్యంలో ఈ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ, "భారత్-చైనా మధ్య అరుణాచల్ ప్రదేశ్‌లో సుదీర్ఘ సరిహద్దు మిగతా 2లో..

## డ్రగ్స్ రాకెట్ ముఠా గుట్టురట్టు

### ముగ్గురు డ్రగ్స్ సరఫరాదారుల అరెస్ట్



**హైదరాబాద్, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు. బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం. నిందితురాలిని విచారించగా.. కేరళలో ఉండే తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించింది. పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు మరింత ముమ్మరంగా కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నెంబర్ 8712663061కు ఫిర్యాదు చేయాలని డీసీపీ సూచించారు.

## కోల్‌కతా హోటల్‌లో అగ్నిప్రమాదం

### అర్థరాత్రి జరిగిన ప్రమాదంలో 9మంది మృత్యువాత

### మృతులంతా చికిత్స కోసం వచ్చిన బంగ్లాదేశీయులుగా గుర్తింపు



**కోల్‌కతా, ఆగస్ట్ 19 (ఆర్ఎన్ఎ):** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని మీర్జా గాలిబ్ వీధిలో ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో 9 మంది చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. రాత్రి 1.45 నిమిషాలకు ప్రమాదం చోటుచేసుకున్నది. అగ్నిమాపక సిబ్బంది తో పాటు పోలీసులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

## నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్-2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

## దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

మంది లబ్ధిదారులకు వందశాతం సబ్సిడీపై త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి ప్రమీల, ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా 60 కి.మీ. చొరబాటు

ఉంది. క్షేత్రస్థాయిలో ఈ సరిహద్దును ఇప్పటికీ పూర్తిస్థాయిలో, స్పష్టంగా నిర్ణయించలేదు. టిబెట్‌తో మన సరిహద్దును గతంలో సరిగ్గా గుర్తించకపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు పెరిగాయి" అని వివరించారు. స్థానికుల ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెబుతూనే, బంగ్లాదేశ్‌కు చెందిన పాత వీడియోలను సామాజిక మాధ్యమాల్లో చూపిస్తూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. ఇటువంటి చర్యలు సరిహద్దుల్లో పహారా కాస్తున్న సైనిక బలగాల మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో మౌలిక వసతుల కల్పనలో గత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కిరణ్ రిజిజు ఈ సందర్భంగా ఆరోపించారు. "సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు నిర్మించకపోవడమే తమ విధానమని నాటి రక్షణ మంత్రి ఏకే ఆంటోనీ పార్లమెంటులోనే చెప్పారు. దీనివల్ల చైనా మనకంటే ముందే అక్కడే మౌలిక సదుపాయాలను నిర్మించుకోగలిగింది. 2014లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రోడ్లు లేని మారుమూల ప్రాంతాల్లోనూ యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టాం" అని తెలిపారు. సరిహద్దులు స్పష్టంగా లేని కొన్ని ఎత్తయిన ప్రాంతాల్లో చైనా గతంలోనే శిబిరాలు ఏర్పాటు చేసుకుందని, అంతేకానీ భారత గ్రామాలను ఆక్రమించుకోలేదని రిజిజు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఇండో-టిబెటన్ బార్డర్ పోలీస్ (ఐటీబీపీ) గస్తీని మరింత బలోపేతం చేసినట్లు వెల్లడించారు.

## బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు

మీడియా లేదా ఇతర వేదికల ద్వారా నిర్వహించిన ప్రమోషన్స్‌పై కూడా ఈడీ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇక బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు నిధి అగర్వాల్‌కు అందిన రెమ్యునరేషన్‌పై కూడా ఈడీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఒక్కో ప్రమోషన్‌కు ఎంత మొత్తంలో పారితోషికం తీసుకున్నారు, ఆ మొత్తాలు ఏ విధంగా చెల్లించబడ్డాయి, ఎవరి నుంచి చెల్లింపులు వచ్చాయి వంటి అంశాలపై అధికారులు వివరాలు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు లేదా వారికి సంబంధించిన వ్యక్తులు నిధి అగర్వాల్ బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసిన డబ్బు లావాదేవీలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఆ చెల్లింపులు ప్రమోషనల్ కాంట్రాక్టులకు సంబంధించినవేనా, వాటికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా అనే అంశాలపై కూడా విచారణ జరిగినట్లు తెలుస్తోంది.

## కోల్‌కతా హోటల్‌లో అగ్నిప్రమాదం

సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గాయపడ్డవారిని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. దట్టమైన పొగ కమ్ముకోవడం వల్ల పై అంతస్తులకు చేరుకోవడానికి అగ్నిమాపక సిబ్బంది ఇబ్బందిపడింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో ఓ చిన్నారి సహా 9 మంది మృతి చెందారు. న్యూమార్కెట్ ప్రాంతంలోని ఫ్రీ స్కూల్ వీధిలో అర్ధరాత్రి 2 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పలువురు చిక్కుకుపోయి మరణించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారందరూ బంగ్లాదేశీయులేనని అగ్నిమాపక శాఖ తెలిపింది. మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం వారు కోల్‌కతాకు వచ్చారని అధికారులు తెలిపారు. ఏసీ పేలడంతో మూడో అంతస్తులో మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఘటనకు గల కారణం ఇంకా వెల్లడించలేదు. మంటలు చెలరేగగానే హోటల్‌లోని కొందరు బయటకు పరుగుతీశారు. అగ్నికీలలు చుట్టూ ఉన్న ఇళ్లవైపు వ్యాపించడంతో ప్రజలు హాహాకారాలు చేశారు. ఘటన గురించి తెలియగానే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నాలుగు ఫైర్ ఇంజన్ల సాయంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చారు. దట్టమైన పొగ వ్యాపించడంతో సహాయ కార్యక్రమాలకు కాస్త అంతరాయం ఏర్పడిందని ఓ పోలీసు అధికారి తెలిపారు. కాగా రెండు రోజుల క్రితం బిర్భూమ్ జిల్లాలోని ఓ హోటల్ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 8 మంది మరణించగా పలువురు గాయపడ్డారు.

# ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు. అఉ÷ఒ÷ఇ కింద రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు.




జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

## కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

### రైలు, రహదారి మౌలిక సదుపాయాలకు పెద్దపీట
### రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆమోదం

**న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులు కాగా, మరొకటి బిహార్‌లో రహదారి ప్రాజెక్టు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. ఇవి నాలుగు రాష్ట్రాల్లో రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినవి. ముఖ్యంగా గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.2,229 కోట్లతో గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖరగ్‌పూర్-భద్రక్ 4వ లైన్‌కు రూ.3,352 కోట్లు, భద్రక్-హరిదాస్‌పూర్ 4వ లైన్‌కు రూ.1,583 కోట్లు, కటక్-పారాదీప్ 3, 4వ లైన్లకు రూ.2,286 కోట్లు కేటాయించార. రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. మొత్తం మీద సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు కూడా మరింత సులభతరం కానున్నాయి. లాగే బిహార్‌లోని ముజఫర్‌పూర్ -సీతామర్హి-సోన్‌బర్సా హైవే నిర్మాణానికి కూడా కాబినెట్ నుంచి ఆమోదం లభించింది. నాలుగు లైన్లతో నిర్మించే ఈ హైవేకు రూ.3,591 కోట్లు కేటాయించారు. ఈ రహదారి బిహార్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానాన్ని కల్పించడంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు రవాణా సౌకర్యాలను బలోపేతం చేయనుంది.

## ఇండిగో వెబ్‌సైట్ డౌన్.. టికెట్లు బుక్ చేసుకోలేక ప్రయాణికుల అవస్థలు!

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19 (ఆర్ఎన్ఎ):** దేశీయ విమానయాన మార్కెట్లో అతిపెద్ద సంస్థ ఇండిగో వెబ్‌సైట్‌లో బుధవారం సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో పలువురు ప్రయాణికులు విమాన టికెట్లు బుక్ చేసుకోలేకపోయారు. ఢిల్లీ నుంచి పలు నగరాలకు వెళ్లేందుకు ఇండిగో వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు ఈ సమస్య ఎదురైంది. వేర్వేరు తేదీల్లో విమానాల కోసం వెతికినా అందుబాటులో ఉన్న సర్వీసుల వివరాలు కనిపించలేదని ప్రయాణికులు తెలిపారు. మరో ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లోనూ ఇండిగో టికెట్ బుక్ చేసుకునే సమయంలో సాంకేతిక సమస్య ఉన్నట్లు సందేశం వచ్చింది. కొద్దిసేపటి తర్వాత మళ్లీ ప్రయత్నించాలని సూచించింది. వెబ్‌సైట్ సమస్యపై పలువురు ప్రయాణికులు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఫిర్యాదు చేశారు. టికెట్లు బుక్ చేసుకోవడంతో పాటు ఆన్‌లైన్ చెక్-ఇన్ పూర్తి చేయడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. విమానాల వివరాలు కనిపించకపోవడంతో తదుపరి ప్రక్రియకు వెళ్లలేకపోయామని తెలిపారు. అయితే ఈ సాంకేతిక సమస్యకు కారణమేంటన్న దానిపై ఇండిగో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సమస్య ఎంతమందిని ప్రభావితం చేసిందన్న వివరాలు కూడా వెల్లడించలేదు. దేశీయ విమానయాన మార్కెట్లో ఇండిగోకు 65 శాతానికి పైగా వాటా ఉంది. గత డిసెంబరులోనూ సంస్థ భారీ స్థాయిలో కార్యకలాపాల సమస్యను ఎదుర్కొంది. పైలట్ల రోస్టర్ నిర్వహణలో లోపాల కారణంగా సుమారు 4,500 విమానాలు రద్దయ్యాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజా ఘటనతో విమాన ప్రయాణాలకు సంబంధించిన డిజిటల్ సేవలపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. టికెట్ బుకింగ్, విమాన వివరాలు, ఆన్‌లైన్ చెక్-ఇన్ వంటి సేవలన్నీ వెబ్‌సైట్లు, యాప్‌లపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఇలాంటి సాంకేతిక సమస్యలు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

## 22/ఎ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

### ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి .... పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి
### అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 22/ఎభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 22/ఎ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ధి పొందిన కొందరు తమ అనుభవాన్ని వెల్లడించారు.

## ఫిలిప్పీన్స్‌లో ఎన్నారై అడ్వైజరీ కమిటీ పర్యటన

### మనీలాలో కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ అధికారులతోనూ భేటీ ... ఉత్తమ వలస విధానాలపై చర్చలు
### గల్ఫ్ కార్మికుల కోసం మెరుగైన వలస విధానాల కోసం కృషి... ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వలస వెళ్లిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన వలస విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందం సభ్యులు బుధవారం ఫిలిప్పిన్స్ దేశ రాజధాని మనీలాలోని ఇండియన్ ఎంబసీని సందర్శించారు. తర్వాత మనీలాలోని కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ ఉన్నతాధికారులతోనూ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ వలస విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫిలిప్పీన్స్ దేశ వలస విధానాన్ని ఆ దేశ ఉన్నత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్



ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వలస విధానాన్ని అమలు చేస్తున్న ఫిలిప్పీన్స్ దేశంలో అమలులో ఉన్న విధి విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇదే తరహా మెరుగైన వలస విధానాన్ని గల్ఫ్ కార్మికుల కోసం అమలు చేసేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడించారు. మనీలాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అంబసడర్ హర్ష కుమార్ జైన్, ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్ లతో వలస కార్మికుల విధానాల అంశాలపై కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. గల్ఫ్ కార్మికులను సంక్షేమం కోసం ఫిలిప్పీన్స్ తరహా విధానాలను అమలు చేస్తామన్నరాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఎన్నారై అడ్వైజరి కమిటీ ఫిలిప్పీన్స్ దేశంలో పర్యటిస్తోంది. ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బిఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, శ్రీనివాస్ జునుగురు, లైజన్ ఆఫీసర్ ఆది కార్తీక్, తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

## రాయదుర్గం పోలీసులకు కోర్టు నోటీసులు

**హైదరాబాద్, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పోక్సో కేసులో నిందితుడిని వేధించి చిత్రహింసలకు గురిచేశారన్న ఆరోపణల నేపథ్యంలో రాయదుర్గం పోలీసులకు రాజేంద్రనగర్ కోర్టు నోటీసులు జారీ చేసింది. రిమాండ్ సమయంలో నిందితుడి ఒంటిపై గాయాలను న్యాయవాది కోర్టుకు చూపించారు. దీంతో రాజేంద్రనగర్ కోర్టు తక్షణమే నిందితుడిని విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. నిందితుడిని వేధింపులకు గురిచేసిన అంశంపై షోకాజ్ నోటీసులు జారీచేసింది. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని రాయదుర్గం పోలీసులను కోర్టు ఆదేశించింది. నిందితుడి రిమాండ్ రిజెక్ట్ చేస్తూ బెయిల్ మంజూరు చేసింది.

## రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు

### హత్యకు పాల్పడింది ..అదే స్కూల్‌లోని ఇద్దరు టెన్త్ స్టూడెంట్స్
### జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం ప్రిన్సిపల్ హత్య
### వివరాలు తెలియడంతో విస్తుపోయిన టీచర్లు, స్టూడెంట్స్

**నల్గొండ, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె.రూపారెడ్డి హత్య కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆమె నిర్వహిస్తున్న పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులే రూపారెడ్డిని హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. డబ్బుల కోసమే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనలో విద్యార్థుల పాత్ర బయటకు రావడంతో తోలి విద్యార్థులు,టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి దుర్మార్గానికి ఒడిగడతారని అనుకోలేదని అంటున్నారు. ఈ నెల 11న కొండమల్లేపల్లి మండలంలోని వేర్వేరు తండాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మాస్క్, హుడీ ధరించి రూపారెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. ఒక విద్యార్థి ఇంట్లోకి వెళ్లి డబ్బులు ఇవ్వాలని బెదిరించగా.. ఆమె ప్రతిఘటించారు. మాస్క్ ఊడిపోవడంతో విద్యార్థిని గుర్తించి కేకలు వేశారు. గుర్తింపు బయటపడటంతో వెంట తీసుకెళ్లిన కత్తితో రూపారెడ్డిని పొడిచి హత్య చేశాడు. అనంతరం ఇంట్లో ఉన్న రూ.2.20లక్షలు తీసుకుని బయట ఉన్న మరో విద్యార్థికి రూ.40వేలు ఇచ్చాడు. ఇద్దరు విద్యార్థులు చోరీలు చేస్తూ జల్సాలకు అలవాటు పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. విచారణ సమయంలో విద్యార్థి జేబులో ఉన్న రూ.1.60లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు రక్తపు మరక ఉండటాన్ని గుర్తించారు. రక్తపు మరకలపై ప్రశ్నించడంతో విద్యార్థులు నిజం అంగీకరించారు.

## సినిమా టిక్కెట్లపై ప్రభుత్వం కీలక ఆదేశాలు

### థియేటర్ స్క్రీన్స ఆధారంగా రేట్లు
### ఐదు షోలకు అనుమతి.. ఆదాయంలో కార్మికులకు వాటా

**హైదరాబాద్, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణలో సినిమా టికెట్ రేట్లపై ప్రభుత్వం కీలక జీవో జారీ చేసింది. కొత్తగా స్పెషల్ థియేటర్స్ కేటగిరీని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 7.1 సౌండ్, 2కె/4కె స్క్రీన్లకు స్పెషల్ కేటగిరీ వర్తించనుంది. ప్రతి థియేటర్‌లో 25 శాతం నాన్-ప్రీమియం సీట్లు ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉదయం 8 నుంచి రాత్రి ఒంటిగంట వరకు 5 షోలకు అనుమతి ఇచ్చింది. చిన్న సినిమాలకు ప్రతి రోజు ఒక షో తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. రూ.100 కోట్లు పైబడిన సినిమాలకు ప్రభుత్వం సూపర్ హై బడ్జెట్ హోదా కల్పించింది. తొలి 10 రోజులు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం కల్పించింది. టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత శాతాన్ని కార్మికుల సంక్షేమ నిధికి విరాళంగా ఇవ్వాలని షరతు పెట్టింది. కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి వరకు విరాళం తప్పనిసరి చేసింది.

### కేంద్ర ప్రభుత్వానివి కుట్రపూరిత రాజకీయాలు

## ఎస్ఐఆర్ పేరుతో భారీగా ఓట్ల తొలగింపు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపణ

**ఖమ్మం, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఎస్ఐఆర్ అనే ప్రక్రియను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీతో కలిసి భాజపా కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు ఎస్ఐఆర్ అనే భూతాన్ని చూపి భారీగా ఓట్ల తొలగింపుకు తెరలేపిందన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పీఏసీ సమావేశంలో ఎఐసిసి కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కో ఇన్చార్జి సచిన్ సావంత్, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ ,పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివసా రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల ఓట్లే లక్ష్యంగా సుమారు 67 నుంచి 68 లక్షల ఓట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టడమే కాకుండా, మరో 70 లక్షల ఓట్లను గాలిలో పెట్టి ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారు. కుట్రలను తిప్పికొట్టేందుకు రాబోయే 4-5 రోజుల్లో బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

## ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి..

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**ఖమ్మం, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్రామీణ ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తూ పల్లెల ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బుధవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా కూసుమంచి మండలం క్యాంప్ కార్యాలయంలో అర్హులైన 12 మంది దివ్యాంగులకు వందశాతం సబ్సిడీపై మూడు చక్రాల మోటార్ వాహనాలను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నాను. రూ. 61.76 కోట్లతో ప్లలెగూడెంలో సీసీ, బీటీ రోడ్ల తో పాటు వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పల్లెగూడెంలో ప్రభుత్వ మరియు అసైన్డ్ భూములను ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలి.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# సవాళ్లను స్వీకరిస్తేనే ప్రజలు ఆదరిస్తారు!

సవాళ్లను స్వీకరించకుండా..సమస్యలను పరిష్కరించకుండా ఎల్లకాలం పాలన సాగించడం సాధ్యం కాదు. ముఖ్యంగా ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకపోతే ప్రజలు నిరంతరాయంగా ఓటేస్తారని అనుకోవడం కూడా పొరపాటే. ఈ దేశంలో మహామహులను ఓడించిన చరిత్ర ఉంది. భారతీయ జనతాపార్టీ కూడా ఇప్పుడు అదే కోవలోకి వస్తుంది. ఇటీవల ఎర్రకోట మీదుగా ప్రధాని మోడీ చేసిన ప్రసంగంలో మహిళా రిజర్వేషన్ల గురించి ప్రస్తావించారు. దీనిపై ఎప్పుడో పార్లమెంట్ ఆమోదించినా, మళ్లీ ప్రధాని పదేపదే అదే విషయం ప్రస్తావిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇప్పుడున్న 542 లోక్‌సభ సీట్లకు మహిళా రిజర్వేషన్లు ప్రకటిస్తే ఎవ్వరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఒకే సమస్యలను పదేపదే ఎత్తి చూపడం ద్వారా ప్రజల్లో కూడా విసుగు తెప్పిస్తుంది. ఇకపోతే డీలిమిటేషన్ కూడా రాజకీయ లబ్దికోసమే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ఈ క్రమంలో ఈ రెండు విషయాల్లో మొన్నటి పార్లమెంట్ సమావేశాల్లో గట్టెక్కించాలనుకున్న మోడీ ద్వయం వ్యూహం బెడిసి కొట్టిందనే చెప్పాలి. ఈ క్రమంలో త్వరలోనే యూపి, పంజాబ్ ఎన్నికలు రాబోతున్నాయి. ఇందుకోసమేనా అన్నట్లుగా బిజెపి కూడా కొత్త కార్యవర్గాన్ని ప్రకటించు కుంది. కొత్తగా కొందరిని పార్టీలోకి తీసుకున్నారు. పార్టీని బలోపేతం చేయడం ద్వారా ముందుకు సాగాలని బిజెపి చూస్తోందనడానికి ఈ కూర్పు నిదర్శనంగా చూడాలి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు, బంకీపూర్ సహా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఫలితాల తీరుతెన్నుల తర్వాత భారతీయ జనతా పార్టీ, కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలిలో మార్పు వచ్చింది. అయితే ఇది చెప్పుకోదగ్గ రీతిలో లేదు. ఎందుకంటే ప్రజలు ఆశిస్తున్నది ఇది కాదు. వారు కోరుకుంటున్నది ఇలాంటి మార్పులు కావు. సమాజంలో వస్తున్న మార్పులపై స్పందించాల్సిన అవసరం ఉంది. దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువత, విద్యార్థుల్లో ఆలోచనలు మారుతున్నాయి. జన్ జడ్, యువతతో సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలన్న ఆలోచనలకు అనుగుణంగా బిజెపిలో మార్పు కనిపించడం లేదు. పన్నెండేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాల ప్రభావం గురించి చర్చించడం లేదని అనిపిస్తోంది. ఎందుకంటే యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి. ఈ పన్నెండేళ్ల కాలంలో కేంద్రంలో మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ దేశంలో అనేకానేక సంస్కరణలు తీసుకుని వచ్చింది. మౌళికరంగంలో అనేక మార్పులు తెచ్చింది. దేశంలో అభివృద్దిని పరుగులు పెట్టించింది. రోడ్డు, రైల్వే రంగాల్లో అనూహ్య మార్పులు వచ్చాయి. ఎన్నడూ ఊహించని విధంగా పురోభివృద్ది కనిపిస్తోంది. అయితే విమానయానరంగం అందనంత ఎత్తులో ఉంది. తిరుపతికి వెళ్లాలంటే భయపడే స్థితిలో విమాన టిక్కెట్ రేట్లు పెరిగాయి. విమయానయాన రంగాన్ని ప్రజలకు చేరువ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారు. ఇక అన్నింటికి మించి విద్యా,వైద్యరంగాలు నీరుగారి పోతున్నాయి. చదువుల, వైద్యం ప్రజలు భరించలేనంత భారంగా మారాయి. వీటిపై కేంద్రం దృష్టి పెట్టడం లేదు. విద్యార్థులు, యువజనుల ఆందోళనను పాలకులు పట్టించుకోవాలి. అలాకాకుండా అభిజిత్ దీప్కేకు ఆప్‌తో సంబంధాలు ఉన్నాయని వాదించడం సరికాదు. యువతలో వచ్చిన ఆందోళనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. వారు ఏమి కోరుకుంటున్నారో అధ్యయనం చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం ఎంతవరకు ఆత్మ విమర్శ చేసుకుంటున్నదన్నదే ముఖ్యం. కమలం పార్టీ బాగా విస్తరించిందని, తన కాళ్లమీద తాను నిలబడిందని, ప్రపంచంలో ఎవ్వరికీ లేని కార్యకర్తల బలం ఉందని విర్రవీగితే....ప్రజలు ఊదితే వచ్చే గాలిలో కొట్టుకు పోగలరు. పార్టీ వ్యూహరచన పుణ్యమా అని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా 14 కోట్ల మంది సభ్యులతో అవతరించిన బీజేపీ నిజానికి పటిష్టంగానే ఉందని ఒప్పుకోక తప్పదు. ఎన్నికలను అవలీలగా గెలిచేందుకు ఒక భారీ యంత్రాంగాన్నే రూపొందించుకుంది. బీజేపీకి తిరుగులేకుండా చేసేందుకు ప్రత్యర్థి పార్టీలను నయానా భయానా వశపరుచుకోవడమో, తుత్తునియలు చేయడమో చేయగలిగింది. అయినా 2024 ఎన్నికల్లో కేవలం 240 సీట్లు మాత్రమే సాధించింది. దీంతో ఎన్‌డిఎ బలంతో మళ్లీ పగ్గాలు చేపట్టింది. నిజానికి ఇదే ఓ హెచ్చరికగా బిజెపి తీసుకోవాలి. అలా కాకుండా ప్రత్యర్థులను బలహీనపరిచి ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ వస్తోంది. చివరకు బెంగాల్‌ను సైతం వశపరచుకుంది. తిరుగులేని శక్తిగా ఎదిగిన తర్వాత బీజేపీ అగ్ర నాయకత్వాన్ని ప్రశ్నించగల శక్తి పార్టీలో ఎవ్వరికీ లేకుండా పోయింది. మద్దతు ఇస్తున్న పార్టీల్లో టిడిపి సైతం ఎదిరించే స్థితిలో లేదు. కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల నిరసన ఈ పరిణామాలపై ఆత్మావలోకనం చేసుకునేందుకు ఇదో మంచి అవకాశం. దశాబ్ద కాలానికి పైగా మోదీ ఒక రాజకీయ భావజాలాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పుడు కొంచెం దానినుంచి బయటకు వచ్చి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ అధ్యక్షుడితో సహా అన్ని నియామకాల విషయంలో మోడీ ద్వయం పెత్తనమే సాగుతోంది. ఇప్పుడు కొత్త కార్యవర్గ కూర్పులోనూ అదే కనిపిస్తోంది. అయితే ఇది చాలదని గుర్తించాలి. ప్రజలకు మంచి చేసుకోవడానికి ఇంకా మంచిపనులు అనేక చేయాలి. ధరలను అదుపు చేయడం మొదలు, నిరుద్యోగ యువతను ఉపాధి, ఉద్యోగాల బాట పట్టించడం ముఖ్యం.

# కశ్మీర్‌లోకి 10వేల మంది ఉగ్రవాదుల తరలింపు

## నసీర్ మాద్నీ సంచలన వ్యాఖ్యలు

**లాహోర్,ఆగస్ట్19(ఆర్‌ఎన్‌ఎ):** పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ మతబోధకుడు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని బహావల్‌నగర్‌లో ఆగస్టు 14న జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన నసీర్ మాద్నీ కశ్మీర్ గురించి పలు సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఉగ్రసంస్థ ఎల్‌ఈటీ చీఫ్ హాఫీజ్ సయీద్ కశ్మీర్‌లోకి 10 వేల మంది ఉగ్రవాదులను పంపించినట్టు చెప్పాడు. దీంతో, కశ్మీర్‌లో ఉగ్ర నెట్‌వర్క్ వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం అవుతోంది. హాఫీజ్ సయీద్ సారథ్యంలోని లష్కరే తొయిబా భారత్‌లో అనేక దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి హాఫీజ్‌పై పలు కేసులు నమోదయ్యాయి. 26/11 దాడుల్లో మంది పాక్ ఉగ్రవాదులు సముద్రమార్గంలో ముంబైలోకి ప్రవేశించి నాలుగు రోజుల పాటు మారణ హోమం సృష్టించారు. ఈ ఉగ్రవాద దాడిలో 166 మంది మరణించగా 300 మంది గాయపడ్డారు. ఇక గతేడాది పహల్గాం దాడిలో 26 మంది సాధారణ పౌరులు కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి జమ్మూలోని కోర్టు హాఫీజ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఐక్యరాజ్య సమితి, అమెరికా కూడా ఎల్‌ఈటీని ఉగ్రవాద

# బాంబు పేల్చిన సుష్మితా పటేల్

### సిఎం రేవంతా..పొంగులేటా...అర్థం కావడం లేదు... కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వకుంటే ఒంటరిపోరాటం

### తెలంగాణ రాజకీయాల్లో కాక రేపిన కొండాసురేఖ తనయ... వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి మల్లు రవి

**వరంగల్,ఆగస్ట్19(ఆర్‌ఎన్‌ఎ):** మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మితా పటేల్ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ కాక రేపుతున్నాయి. కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మితా పటేల్ సంచలన ప్రకటన చేశారు. పరకాల నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పరకాల నియోజకవర్గ రాజకీయాలపై సుష్మితా పటేల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్ రెడ్డి వ్యవహారశైలిలో మార్పు వచ్చిందని అన్నారు. 'పొంగులేటి ముఖ్యమంత్రా.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రా? అసలు ఎవరు సీఎం అనేది అర్థం కావడం లేదు' అని సుష్మితా వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు తన తండ్రి కొండా మురళీ కూడా సహకరించారని సుష్మితా పటేల్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే సమయంలో కొండా మురళీ సహకారం ఉందని అన్నారు. అందుకు ప్రతిఫలంగా కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇవ్వలేదని



రేవంత్ రెడ్డి ఇక్కడి మైసమ్మపై ప్రమాణం చేయగలరా? అని సుష్మితా పటేల్ సవాల్ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ మధ్య పోటీ జరుగుతోందని వ్యాఖ్యానించారు. రేవూరి ప్రకాశ్ రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని సుష్మితా పటేల్ ప్రశ్నించారు.

దమ్ముంటే రాజీనామా చేయించి ఇప్పుడే ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. తమ ఇలాఖాకు వచ్చి తమతో ఎందుకు పెట్టుకుంటున్నారని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన అవినీతిపై ఇప్పటివరకు రూ.200 కోట్ల వ్యవహారాన్ని మాత్రమే బయటపెట్టానని సుష్మితా పటేల్ ఆరోపించారు. తనపై కౌంటర్ ఇస్తే మరిన్ని విషయాలను బయటపెడతానని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల సమయానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారో, ఉండరో కూడా సందేహమేనని సుష్మితా పటేల్ వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పూర్తి వివరాలు తెప్పించుకున్న తర్వాత ఆమెపై పార్టీ పరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# మండలిలో డిఎస్సీపై వైసిపి వాయిదా తీర్మానం

## తిరస్కరించిన ఛైర్మన్..కాసేపు మండలి వాయిదా

**అమరావతి,ఆగస్ట్19(ఆర్‌ఎన్‌ఎ):** ఏపీ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు మూడో రోజు ప్రారంభమయ్యాయి. బుధవారం శాసనమండలిలో మెగా డీఎస్సీపై వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ వాయిదా తీర్మానాన్ని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ఛైర్మన్ పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆందోళనతో శాసనమండలిలో గందరగోళం నెలకొంది. డీఎస్సీపై చర్చ పెట్టాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. పోడియాన్ని చుట్టుముట్టి ఆ పార్టీ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మెడలో నల్ల కండవాలతో ఆ పార్టీ సభ్యులు సభకు వచ్చారు. వైసీపీ సభ్యులు ఆందోళనతో ఏపీ శాసన మండలిని ఛైర్మన్ కాసేపు వాయిదా వేశారు. వైసీపీ సభ్యులు సభను గౌరవించటం లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. ఛైర్మన్ సభను ఆర్డర్‌లో పెట్టాలని సూచించారు. ఛైర్మన్ టేబుల్‌ను కొడుతూ ఎందుకు నినాదాలు చేస్తున్నారని ప్రశ్నించారు. సభా మర్యాద కాపాడాల్సిన బాధ్యత సభ్యులపైనా ఉందని తెలిపారు. మనోహర్ వ్యాఖ్యలపై ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు అసహనం వ్యక్తం చేశారు. సభా నిర్వహణ, నిబంధనల గురించి మీకు బాగా తెలుసు అని అన్నారు. వారిపై ఎలాంటి చర్యలు ఎలా తీసుకోవాలో మీకు తెలుసునని చెప్పారు. సభ సంప్రదాయాల ప్రకారం జరగాలని ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జగన్ హయాంలో కూడా మీరు ఛైర్మన్‌గా వ్యవహరించారని అన్నారు. రెడ్ లైన్ గీసి విపక్షాల వాళ్లు దాటి వస్తే సస్పెండ్ చేశారని ప్రస్తావించారు. ఇప్పుడు కూడా అలాగే చేసేందుకు మీకు అధికారాలున్నాయని తెలిపారు. మూడు రోజులుగా సభకు అంతరాయం కలిగిస్తుంటే చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని నిలదీశారు. ఛైర్మన్‌ను కించపరచాలనే ఆలోచన తమకు లేదని.. ఆయనకు పవర్స్ ఉన్నాయని చెప్పారు.

# ఇరాన్ క్షిపణి దాడులపై అరబ్ ఆగ్రహం

## ఇరాన్‌తో వాణిజ్య బంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటన

**న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్‌ఎన్‌ఎ):** ఇరాన్‌తో అన్ని వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను నిలిపివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో యూఏఈ ఈ చర్య తీసుకుంది. ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా... ఇరాన్‌తో అన్ని వాణిజ్య, వ్యాపార వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలను తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిలిపివేశామని యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అఫ్రా అల్ హమెలీ తెలిపారు. మరో క్షిపణి ముప్పు గురించి దేశ ప్రజల్ని హెచ్చరిస్తూ ఫోన్ అలర్ట్ జారీ చేసిన దాదాపు రెండు గంటల తర్వాత యూఏఈ ఈ ప్రకటన చేసింది. 'ప్రస్తుత పరిస్థితి, క్షిపణి ముప్పు కారణంగా, వెంటనే ప్రజలు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని యూఏఈ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ సదరు ఫోన్ అలర్ట్‌లో పేర్కొంది. అయితే, ఆ అలర్ట్‌ను కొద్దిసేపటికే ఉపసంహరించారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి, ఇరాన్ దాడుల తీవ్రతను యూఏఈ ఎక్కువగా ఎదుర్కొంది. ఈ ప్రాంతంలోని మరే ఇతర దేశం కంటే ఎక్కువగా, దాదాపు 3,000 క్షిపణులు, డ్రోన్‌లు ఆ దేశంపై ఇరాన్ ప్రయోగించింది. గల్ఫ్‌లోని నౌకా రవాణాపై ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆరోపించగా, ఈ ఆరోపణను ఇరాన్ ఖండించింది. ఇరాన్ తమ దేశం వైపు క్షిపణిని ప్రయోగించిందన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వాదనను ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి ఖండించారు. ఈ వాదన ప్రాంతీయ విశ్వాసానికి, భద్రత ప్రయత్నాలకు హానికరమని ఆయన పేర్కొన్నారు.

# యువతకు ఉద్యోగాలు కల్పించాలి

## అఖిల భారత యువజన సమాఖ్య డిమాండ్




**ఏలూరు, ఆగస్టు 19 (ఆర్‌ఎన్‌ఏ):** అఖిల భారత యువజన సమాఖ్య అధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ విధానాల కారణంగా యువత నిరుద్యోగం, ఉపాధి, వలసలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఏలూరు జిల్లా కన్వీనర్ రాజు ఆందోళన వ్యక్తం చేసారు . ప్రతి సంవత్సరం కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు, మరోవైపు ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పోటీ పరీక్షల్లో జాప్యం, పేపర్ లీకులు, పరీక్షల రద్దు, నియామక ప్రక్రియలో అవకతవకల వల్ల నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన జాబ్ క్యాలెండర్, 4 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, కొత్త పరిశ్రమల ఏర్పాటు వంటి హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేసారు. మరోనేత కురెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేసి, ఎంఎస్‌ఎంఇ రంగాన్ని బలోపేతం చేసి స్థానిక యువతకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలనీ, పేపర్ లీకులు, పరీక్షల అవకతవకలను అరికట్టి నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, యువతకు ఉపాధి హక్కుకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని డిమాండ్ చేసారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏఐవైఎఫ్ మాజి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ తదితరులు మాట్లాడగా, కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య యువజన సమాఖ్య మాజీ నాయకులు భజంత్రి శ్రీనివాస్, నాగం అచ్చుత్, కొండేటి విక్రమ్,నవీన్, బి గిరి, సాయి, బ సురేష్, సిద్దు పాల్గొన్నారు

# ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యకేసు

## పాఠశాల విద్యార్థులే హంతకులుగా నిర్ధారణ

**నల్గొండ,ఆగస్ట్19(ఆర్‌ఎన్‌ఎ):** కొండమ్మలెపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ కె. రూపారెడ్డి హత్య ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నెల 11న జరిగిన ఈ హత్య కేసుకు సంబంధించి పోలీసులు మిస్టరీని ఛేదించారని సమాచారం. ఈ దారుణానికి పాల్పడింది అదే పాఠశాలలో చదివిన వంశీ, అనిల్ అనే విద్యార్థులే అని విచారణలో తేలినట్లు సమాచారం.డబ్బుల కోసం ఆశపడే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. హత్య అనంతరం నిందితులు గోవాకు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఈ కేసులో విద్యార్థుల ప్రమేయం ఉండటం స్థానికంగా దిగ్భ్రాం÷-రతిని కలిగించింది. సుమారు 80 మందిని విచారించిన అనంతరం ఆ విద్యార్థులే ఈ దారుణానికి పాల్పడ్డారని గుర్తించినట్లు సమాచారం. రూపారెడ్డి హత్య అనంతరం ఆ విద్యార్థులు సుమారు రూ.4 లక్షల నగదు చోరీ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్‌ఎన్‌ఎ): భారత్‌లో ఈ వారం మొదటి నుంచి బంగారం ధరలు ప్రతి రోజూ ఓ మోస్తరు స్థాయిలో పెరుగుతూనే ఉన్నాయి. యూఎస్ ఫెడ్ ప్రామాణిక వడ్డీ రేటు పెరగదన్న అంచనాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారు. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఆగస్టు 19) ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,900గా ఉంది.

# టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బిఆర్ఎస్ పిలుపు

## హరీష్ రావు, తలసాని శ్రీనివాస యాదవ్‌ల హౌజ్ అరెస్ట్

**హైదరాబాద్,ఆగస్ట్19(ఆర్‌ఎన్‌ఎ):** మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కోకాపేట్‌లోని హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ సందర్శనకు హరీశ్ రావు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నగరం నలువైపులా 'టిమ్స్' పేరుతో సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణ పనులకు కేసీఆర్ శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులను పరుగులు పెట్టించారు. అసెంబ్లీ ఎన్నికల సమయానికి అంటే ఏడాది కాలంలోనే అన్ని దవాఖానల నిర్మాణ పనులు 60 శాతానికిపైగా పూర్తయ్యాయి. గత





సంవత్సరమే మూడు సూపర్ స్పెషాలిటీ దవాఖానలు అందుబాటులోకి రావాల్సి ఉండగా, ప్రస్తుతం సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే హడావుడిగా ప్రారంభోత్సం చేశారు. ఈ నేపథ్యంలో హరీశ రావు హాస్పిటల్ సందర్శనకు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. నత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది. అలాగే మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సనత్ నగర్‌లో నూతనంగా ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని బీఆర్‌ఎస్ హై కమాండ్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, అడ్డుకునేందుకు తమను హౌస్ అరెస్ట్‌లు, అక్రమ నిర్బంధాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సనత్ నగర్, అమీర్‌పేట డివిజన్‌లకు చెందిన ముఖ్య నాయకులను పోలీసులు ఎందుకు హౌస్ అరెస్ట్ చేశారని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.

# పురుషులలో వక్షోజాలు కలిగేలా చేసే ఆహారాలు



కొంతమంది పురుషులు స్త్రీల లాగానే రొమ్మును కలిగి ఉంటారు. వీటికి గల కారణాలు మరియు కలిగేలా చేసే ఆహార పదార్థాల గురించి ఇక్కడ తెలుపబడింది.

**గైనేకోమాస్టియా**

పురుషులు ఎక్కువగా పెద్ద పెద్ద కండలు మరియు విశాలమైన భుజస్కందాలు కలిగి ఉంటారు కానీ కొంత మంది పురుషులలో ఛాతి చూడటానికి అసహ్యంగా ఉంటుంది. ఇలాంటి వారి ఛాతి చూడటానికి అమ్మాయిల రొమ్ము లేదా వక్షోజాలు లేదా స్తనాలను వలే ఉంటాయి. వైద్యపరంగా దీనిని "గైనేకోమాస్టియా" గా పేర్కొంటారు, సాధారణంగా ఈస్ట్రోజెన్ అధిక స్థాయిలకు చేరటం వలన ఈ పరిస్థితి కలుగుతుంది. కానీ, ఈ హార్మోన్ స్థాయిలను పెంచే ఆహార పదార్థాలను తినటం వలన కూడా ఈ పరిస్థితి ఏర్పడవచ్చు. అవేంటో మీరే చూడండి.

**చికెన్ సూప్**

ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు, ముఖ్యంగా చికెన్ సూప్ థాలేట్స్ లను కలిగి ఉంటుంది. ఈ థాలేట్ లు ప్లాస్టిక్ సాఫ్టనర్స్ వలే ఉండి, ఈస్ట్రోజెన్ హార్మోన్ వలే పని చేస్తాయి. ఫలితంగా గైనేకోమాస్టియా కలిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. "ఎన్విరాన్మెంటల్ వర్కింగ్ గ్రూప్" వారు క్యాన్డ్ ఆహార పదార్థాలపై నూతన పరిశోధనలు జరిపి, చికెన్ సూప్, శిశువు సూత్రం, రావియోలీ, బీన్స్ మరియు ట్యూనా వంటి ఆహార పదార్థాలు అధిక మొత్తంలో థాలేట్స్ లను కలిగి ఉంటాయని తెలిపారు.

**పెస్టిసైడ్ లను కలిగి ఉండే సముద్రపు ఆహారాలు**

మనం తినే ఆహార పదార్థాలలో అధిక మొత్తంలో పెస్టిసైడ్ కలవటం వలన కూడా గ్యెనేకోమాస్టియా కలుగుతుంది. సగటున ఒక రోజు, ఒక వ్యక్తి ఆహార పదార్థాల ద్వారా 10 నుండి 13 రకాల పెస్టిసైడ్ లకు బహిర్గతం అవటం వలన అతడు/ఆమెలో ఉండే వినాళగ్రంధుల నుండి వెలువడే హార్మోన్ లు అసమతుల్యతలకు గురవుతాయి. రొయ్యలు మరియు చేపల వంటి సముద్రపు ఆహార పదార్థాలు అధిక మొత్తంలో పెస్టిసైడ్ లను కలిగి ఉండి, గైనేకోమాస్టియాకు గురి చేస్తాయి.

**బెర్రీలు**

చాలా రకాల పండ్లు ముఖ్యంగా బెర్రీ వంటి తినదగిన పండ్లు ఈస్ట్రోజెన్ వలే ప్రవర్తించే పెస్టిసైడ్ లతో కలుషితం చెంది ఉంటాయి. కావున, స్ట్రాబెర్రీ, పీచెస్, ఆపిల్, చెర్రీ మరియు కాలే వంటి పండ్లు పురుషులలో వక్షోజాలు ఏర్పడేలా చేస్తాయి.

**సూపర్ మార్కెట్లో లభించే మాంసం, చీస్**

సూపర్ మార్కెట్లలో మాంసం మరియు చీస్ లను పాలీ విన్కెల్ క్లోర్కెడ్ (పివిసి) లతో తయారు చేసిన వ్రాప్ లేదా కవర్ లతో కప్పి ఉంచుతారు, ఇవి హార్మోన్ ల స్థాయిలలో తారతమ్యాలు కలిగిస్తాయి. కావున సూపర్ మార్కెట్లలో మాంసాన్ని కొనుగోలు చేయకుండా, తాజాగా లభించే మాంసపు మార్కట్లలో కొనండి.



**ఫాటీ ఆహార పదార్థాలు**

అధిక మొత్తంలో కొవ్వు గల ఆహార పదార్థాలు, పెస్టిసైడ్ లతో కలుషితం చెందిన ఆహార పదార్థాలు, థాలేట్ లను కలిగి ఉండేవి సాధారణంగా పురుషులలో వక్షోజాలను కలిగించటంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఈ ఆహార పదార్థాల వలన ఊబకాయంతో పాటూ పురుషులలో వక్షోజాలు కలగవచ్చు

# జీడిపప్పుతో ఆరోగ్య ప్రయోజనాలు

జీడిపప్పు, వెన్న లాంటి రుచిని కలిగి ఉండే గింజల రకానికి చెందినదిగా ఉంటుంది. భారతదేశంలో జీడిపప్పును, నల్ల ఉప్పుతో కలిపి స్నాక్స్ వలె తీసుకునే అలవాటు ఉంటుంది. జీడిపప్పు దట్టమైన పోషకాలతో కూడుకుని, అనేక ఆరోగ్య ప్రయోజనాల గనిగా ఉంటుంది. జీడిపప్పు స్వీట్ ఫ్లేవర్ను కూడుకుని, స్థిరమైన సున్నితత్వాన్ని కలిగి ఉంటుంది. ఇవి వైవిధ్యమైన గింజలుగా చెప్పబడుతాయి. ఎందుకంటే వీటిని పచ్చిగా లేదా కాల్చి, ఉప్పును జోడించి, లేదా ఉప్పు జోడించకుండా, ఏరూపంలోనైనా తీసుకోవచ్చు. అంతేకాకుండా, జీడిపప్పుతో పాలు, సోర్ క్రీమ్, జీడిపప్పు వెన్న, మరియు క్రీమ్ సాస్ వంటి ఇతర డైరీ ప్రత్యామ్నాయాలను తయారుచేయడానికి కూడా ఈ గింజలను వినియోగించడం జరుగుతుంది. ఔషధ మరియు పారిశ్రామిక ఉపయోగాలకు వినియోగించే జీడిపప్పు మొక్కల భాగాలు, ఈ క్రింది విధంగా ఉన్నాయి : జీడిపప్పు చెట్టు (ముంతమామిడి చెట్టుగా వ్యవహరించడం జరుగుతుంది) బెరడు మరియు ఆకు – వీటిని డయేరియా మరియు వంటి నొప్పుల చికిత్సలో ఉపయోగించడం జరుగుతుంది. అదేవిధంగా ప్రత్యేకించి, ముంతమామిడి ఆకుసారాన్ని రక్తంలోని చక్కెరలను తగ్గించడానికి, మరియు బెరడును నోటి పూతల చికిత్సలో ఉపయోగించడం జరుగుతుంది. జీడిపప్పు పెంకులోని ద్రవం – దీనిలో ఔషధ మరియు యాంటీ బయాటిక్ గుణాలు అధికంగా ఉంటాయి. మరియు కుష్టు(లెప్రసీ), మొలలు, స్కర్వీ, గొంతు అల్సర్లు, మరియు తామర వంటి చికిత్సలో ఉపయోగించడం జరుగుతుంది. జీడిపప్పు విత్తనాలు మరియు కాండం – పగిలిన మడమలను నయం చేయడానికి జీడిపప్పు విత్తనాల నూనెను విరివిగా వాడడం జరుగుతుంది. జీడిమామిడి కాండం నుంచి సేకరించిన గమ్ ను పుస్తకాలకు, చెక్కకు వార్నిష్ గా వినియోగిస్తారు. ముంత మామిడి పండు – ఇది యాంటీ బ్యాక్టీరియల్ గుణాలను అత్యధికంగా కలిగి ఉండే పండ్లుగా ఉంటాయి. మరియు కడుపులో అల్సర్ల చికిత్సలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. ముంత మామిడి పండు నుండి సేకరించిన రసాన్ని స్కర్వీ చికిత్సలో వాడడం జరుగుతుంది. జీడిపప్పులోని పోషక విలువలు : 100 గ్రాముల పచ్చి జీడిపప్పులో 5.20 గ్రాముల నీరు, 553 కిలో కాలరీల శక్తి ఉంటాయి. జీడిపప్పులో ఉండే ఆరోగ్య ప్రయోజనాలు:

**బరువు నిర్వహణలో సహాయం :** ఒక అధ్యయనం ప్రకారం, అరుదుగా గింజలను తీసుకునే మహిళలు, వారానికి రెండు లేదా అంతకంటే ఎక్కువ సార్లు గింజలను తీసుకునే మహిళల కంటే ఎక్కువ బరువును కలిగి ఉన్నట్లుగా తేలింది. మీరు ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి ఒక క్రమప్రాతిపదికన గింజలను తీసుకోవడం ఉత్తమంగా సహాయపడగలదని మరొక అధ్యయనంలో కూడా తేలింది. ఎందుకంటే అవి మీ పొట్టను నిండుగా ఉంచి, శరీరంలో వేడి ఉత్పత్తికి దోహదం చేయగలవని చెప్పబడుతుంది. క్రమంగా జీవక్రియల వేగం పెరుగుతుంది.

**గుండె ఆరోగ్యాన్ని పెంపొందించడంలో :** జీడిపప్పులో మోనోశాచ్యురేటెడ్ కొవ్వులు మరియు పాలీశాచ్యురేటెడ్ కొవ్వులు రెండూ ఎక్కువగానే ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ మరియు ట్రైగ్లిజరైడ్ల స్థాయిలను తగ్గించడానికి మరియు మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడానికి సహాయపడతాయి. ఇది గుండె జబ్బులు, స్ట్రోక్, గుండెపోటు, కరోనరీ హార్ట్ డిసీజ్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ గింజలు కూడా మెగ్నీషియం యొక్క ఘనమైన వనరుగా చెప్పబడుతుంది. ఇది గుండె కండరాలను రిలాక్స్ చేస్తుంది మరియు అధిక రక్తపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరుచడంలో :** ఎముకలు మరియు దంతాల ఆరోగ్యవంతమైన అభివ ృద్ధి కొరకు జీడిపప్పులోని మెగ్నీషియం, ఫాస్పరస్, కాల్షియం మరియు విటమిన్ కె లు అత్యావశ్యకంగా ఉంటాయి. ఎముకల నిర్మాణంలో మెగ్నీషియం కూడా ప్రధానపాత్రను పోషిస్తుంది, ఎందుకంటే ఇది ఎముకలలోని కాల్షియం శోషణలో సహకరిస్తాయి. క్రమంగా ఆస్టియోపోరోసిస్ ప్రమాదాన్ని



తగ్గిస్తుంది.

**మధుమేహం ప్రమాదాన్ని తగ్గిస్తాయి :** జీడిపప్పు మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిదిగా సూచించడం జరుగుతుంది. జీడిపప్పు మొక్క భాగాలలో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉన్నాయని, జీడిపప్పు విత్తనాల సారం ఇన్సులిన్ రెసిస్టెన్స్, మరియు గ్లూకోజ్ క్రమబద్ధీకరణతో ముడిపడివుందని ఒక అధ్యయనంలో కూడా తేలింది.

**క్యాన్సర్ను నివారిస్తుంది :** జీడిపప్పుతో సహా ఇతర చెట్టు కాయలను తరచూ తీసుకోవడం మూలంగా కేన్సర్ వచ్చే ప్రమాదాలు తగ్గుతాయని చెప్పబడుతుంది. ఎందుకంటే, ఇవి టోకోఫెరాల్స్, అనాసార్డిక్ ఆమ్లాలు, కార్డానోల్స్, కార్డోల్స్ వంటి ఫినోలిక్ సమ్మేళనాల వంటి అనామ్లజనకాలకు మంచి వనరుగా ఉంటాయి, ఇవి జీడిపప్పు యొక్క కంకులలో నిల్వ చేయబడతాయి. ఈ అనామ్లజనకాలు ఆక్సిడేటివ్ ఒత్తిడికి కారణమయ్యే ఫ్రీ రాడికల్ నష్టం నుండి శరీర కణాలను రక్షిస్తాయి. ఈ ఆక్సిడేటటివ్ స్ట్రెస్ అనునది, కణ ఉత్పరివర్తనం, డిఎన్ఎ నష్టం,కేన్సర్ కణితి ఏర్పడటానికి దారితీస్తుంది.

**మెదడు పనితీరుకు సహాయకంగా ..** జీడిపప్పులోని న్యూరోట్రాన్స్మిటర్లు, సినాప్టిక్ ట్రాన్స్ మిషన్ మరియు మెదడు ద్రవాల (మెంబ్రేన్ ఫ్లూయిడ్స్) ప్రవాహాన్ని క్రమబద్ధీకరించడం ద్వారా ఆరోగ్యకరమైన మెదడు పనితీరుకు, మరియు పలు మెదడు ప్రక్రియలకు మద్దతును ఇవ్వగలుగుతుంది. అంతేకాకుండా జీడిపప్పులో ఆరోగ్యకర కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. అధిక గింజలను తీసుకోవడం అనేది మహిళల్లో మరింత మెరుగ్గా, మేధోపరంగా ముడిపడి ఉన్నదని ఒక అధ్యయనం తెలియజేస్తుంది

**పిత్తాశయ రాళ్లను నివారిస్తుంది :** అధిక కొలెస్ట్రాల్ కారణంగా పిత్తాశయంలో రాళ్ళు ఏర్పడడం జరుగుతుంటుంది. ఈ సమస్య తలెత్తినప్పుడు, జీడిపప్పులను తరచుగా సేవించడం మూలంగా పిత్తాశయంలో రాళ్ళు ఏర్పడే ప్రమాదాన్ని తక్కువ చేస్తుందని చెప్పబడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం, జీడిపప్పు వినియోగం మహిళల్లో కోలెసిస్టెక్టమీ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని పెంచుతుంది :** జీడిపప్పులో గణనీయమైన మొత్తంలో ఐరన్ ఉంటుంది. ఇది ఎర్ర రక్తకణాలు ఏర్పడటానికి కీలకంగా ఉండడమే కాకుండా, అనీమియా ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. నరాలు, రక్తనాళాలు, రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే ఐరన్ కూడా అవసరంగా ఉంటుంది.

**కంటి ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది :** జీడిపప్పులో ల్యూటీన్ మరియు జీయాక్సాంథానిన్ అధికంగా ఉంటాయి, ఈ రెండు సమ్మేళనాలు ఫ్రీరాడికల్స్ మూలంగా కళ్ళకు తలెత్తే, సెల్యులర్ డ్యామేజ్ నిరోధిస్తుంది. సెల్యులర్ డామేజ్ అనునది మాక్యులర్ డీజనరేషన్ మరియు కంటిశుక్లాల వంటి కంటి వ్యాధులకు దారితీస్తుంది.

**ఆరోగ్యకరమైన చర్మాన్ని నిర్వహించడానికి ఉత్తమంగా సహాయపడుతుంది :** చర్మం ఆరోగ్యవంతంగా ఉండటానికి మరియు అకాల వ ృద్ధాప్య చాయలను నిరోధించడానికి అవసరమైన ఆరోగ్యవంతమైన కొవ్వులను శరీరానికి అందివ్వడంలో జీడిపప్పు చక్కటి వనరుగా పనిచేస్తుంది. దీనిలో కనిపించే యాంటీ ఆక్సిడెంట్, విటమిన్స్ చర్మం సాగుదలను మరియు స్థితిస్థాపకతను మెరుగుపరుస్తాయని చెప్పబడుతుంది.

## బీసీలకు రాజకీయ సాధికారత

### రిజర్వేషన్ల కల్పన గొప్ప నిర్ణయం... ఐటీశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి

**అమరావతి,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడంతో పాటు స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిందని లోకేశ్ తెలిపారు. అలాగే పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు ఈ నిర్ణయం గొప్ప అవకాశంగా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల భాగస్వామ్యం పెరగడం ద్వారా నిర్ణయాధికారంలో వారికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు అండగా నిలుస్తోందని నారా లోకేశ్ అన్నారు. బీసీల సంక్షేమం, రాజకీయ సాధికారత కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. 'ప్రజా ప్రభుత్వం బీసీలకు జై కొట్టింది.. జయహో బీసీ అంటోంది' అని లోకేశ్ పేర్కొన్నారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టం?1994కు అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ముఖ్యమైన అంశమని మంత్రి వివరించారు. నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో మేయర్లు, చైర్మన్లను ఇకపై ప్రత్యక్ష ఎన్నికల విధానంలో ఎన్నుకునేలా నిర్ణయం తీసుకున్నట్లు లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రస్తుత 13 జిల్లా పరిషత్‌లను 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్వాగతించారు. ఇది బీసీల సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత దిశగా మరో కీలక అడుగని పేర్కొన్నారు. 34 శాతం రిజర్వేషన్‌తో లక్షలాది బీసీ కుటుంబాల చిరకాల స్వప్నాలు సాకారం కానున్నాయని అన్నారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు టీడీపీ బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. బీసీల హక్కులను కాపాడటమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలను వంచించిందని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జగన్ మోసం చేశారని పల్లా శ్రీనివాసరావు విమర్శించారు.

## మెట్రో ఫేజ్-2 అనుమతులకు కసరత్తు

### ప్రక్రియను వేగం చేసే పనిలో అధికారులు

**హైదరాబాద్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సంబంధించిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన ఎన్‌సీఓలను త్వరగా జారీ చేయాలని పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు సచివాలయంలో కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులతో జయేష్ రంజన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్ఎమ్ఆర్ఎల్ ఎండీ, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. కేంద్ర అనుమతుల కోసం డీపీఐఐటీ నెట్‌వర్క్ ఎ÷-లానింగ్ గ్రూప్ పక్రియలో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ఫేజ్?2లో భాగంగా 7 కారిడార్ల ద్వారా మొత్తం 122.9 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన భూసేకరణ, రైల్వే క్రాసింగ్‌లు, మూసీ నది దాటే ప్రాంతాలు, గ్యాస్ పైప్‌లైన్లు, విమానాశ్రయ పరిధిలో నిర్మాణ అనుమతులపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రతిపాదిత కారిడార్లకు అన్ని శాఖలు త్వరితగతిన ఎన్‌సీఓలు జారీ చేయాలని సర్ఫరాజ్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. ఫేజ్?2 పనులు ముందుకు సాగితే హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థ మరింత విస్తరించి, నగరంలో ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది.

## వందేమాతరమంటే కాంగ్రెస్‌కు భయం: బండి

**హైదరాబాద్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ఖర్గే తీరుపై ప్రతి భారతీయుడు ఆశ్చర్యానికి లోనవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. స్వాతంత్య్ర వేడుకల్లో వందేమాతరం ఆలపించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. వందేమాతరం ఆలపించడాన్ని చూసి ఒకప్పుడు బ్రిటీష్ వాళ్లు భయపడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. బ్రిటీష్ వాళ్లకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య తేడా కనిపించడం లేదన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, ఎంఐఎం మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని.. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.

## 20 నుంచి సిఎం రేవంత్ విదేశీ పర్యటన

### పది రోజుల పాటు యూకె, అమెరికా సందర్శన

**హైదరాబాద్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఆగస్టు 20 నుంచి 30వ తేదీ వరకు లండన్, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలను సందర్శించడంతో పాటు వివిధ సమావేశాల్లో పాల్గొననున్నారు. ఆగస్టు 20వ తేదీ అర్ధరాత్రి 12:30 గంటలకు న్యూఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరనున్నారు. ఆగస్టు 20 ఉదయం 7 గంటలకు యూకే స్థానిక కాలమానం ప్రకారం లండన్ చేరుకోనున్నారు. ఆగస్టు 21న ఉదయం 10:30 గంటలకు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు ఫుట్‌బాల్ ప్రెజెంటేషన్ కార్యక్రమం కోసం ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు. 22న ఉదయం 10:30 గంటలకు కేంబ్రిడ్జ్ బృందంతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు.



ఉదయం 11:30 గంటలకు లండన్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్‌ను సందర్శించ నున్నారు. సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శించనున్నారు. యూకే పర్యటన అనంతరం ఆగస్టు 23న సీఎం రేవంత్ రెడ్డి లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరి వెళతారు. అక్కడ కూడా పలు ప్రముఖ విద్యా సంస్థలను సందర్శించి సమావేశాల్లో పాల్గొననున్నారు. 24న ఉదయం 10:30 గంటలకు హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సీఎం సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎంఐటి క్యాంపస్‌ను సందర్శిస్తారు. అదే రోజు రాత్రి 7 గంటలకు బాస్టన్ నుంచి న్యూయార్క్‌కు బయలుదేరనున్నారు. 25న ఉదయం 10:30 గంటలకు నోర్త్-ఈస్టర్న్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సీఎం సందర్శించనున్నారు. సాయంత్రం 4 గంటలకు వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందంతో సమావేశం కానున్నారు. 26న న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు, వివిధ వర్గాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యే అవకాశం ఉంది. అమెరికా పర్యటన ముగించుకుని ఆగస్టు 29న న్యూయార్క్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. 30న హైదరాబాద్ చేరుకోనున్నారు. మొత్తంగా సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో యూకే, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, బిజినెస్ స్కూళ్లను సందర్శించడంతో పాటు పలు ప్రతినిధి బృందాలతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ పర్యటన ద్వారా విద్య, పరిశ్రమలు, పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు సంబంధించిన అంశాలపై చర్చలకు అవకాశం ఉండనుంది.

## పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం

### మెరుగైన ధర లభించేలా కృషి: అచ్చన్న

**అమరావతి,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** పొగాకు రైతులకు మెరుగైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లలో సానుకూల పురోగతి సాధించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 117 వేలాలు పూర్తి.. సుమారు 60 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం ఎఫ్‌సీవీ పొగాకు సగటు ధర కిలోకు సుమారు రూ.210గా ఉందని పేర్కొన్నారు. ఇటీవలి రోజుల్లో రోజుకు 1.5 నుంచి 2 మిలియన్ కిలోల వరకు పొగాకు అమ్మకాలు జరుగుతున్నాయని వివరించారు. కొనుగోళ్ల వేగం పెరగడం.. 'నో-బిడ్' శాతం క్రమంగా తగ్గడం మంచి పరిణామం అని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. పొగాకు కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో మరోసారి చర్చించామని తెలిపారు.

కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని కంపెనీలు, ట్రేడర్లకు ఇప్పటికే స్పష్టమైన సూచన చేశామని వివరించారు. నో-బిడ్స్'ను మరింత తగ్గించి రైతుల వద్దనున్న పొగాకు వేగంగా కొనుగోలు చేయాలని అధికారులను ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. రైతులకు లభించే సగటు ధర మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని కూడా కోరినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో అసెంబ్లీ ఫలితాలో రిపీట్

### బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు జోస్యం

**విశాఖపట్నం,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** స్థానిక సంస్థల ఎన్నికల్లో 2024 ఫలితాలే రిపీట్ అవుతాయని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు జోస్యం చెప్పారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కూడా కూటమి కైవసం చేసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి డబుల్ స్టాండ్ ప్లే చేస్తున్నారని మండిపడ్డారు. శాసనమండలికి వైసీపీ ఎమ్మెల్సీలు వస్తున్నారు.. కానీ శాసనసభకు డుమ్మా కొడుతున్నారని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఎవరో మిస్ గైడ్ చేస్తున్నారని అన్నారు. వైసీపీని నాశనం చేయడానికి ఎవరో ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే .. అసెంబ్లీకి వస్తానని జగన్ చెప్పడం సరికాదని అభిప్రాయపడ్డారు. సెంబ్లీకి వస్తే తనకు మాట్లాడే సమయం ఇవ్వరని వైఎస్ జగన్ ఊహాజనితమైన భావనలో ఉన్నారన్నారు. అసెంబ్లీలో తమ సమయం కూడా.. మీకే ఇస్తామని జగన్మోహన్ రెడ్డికి ఆఫర్ కూడా ఇచ్చామని గుర్తు చేశారు. అయినా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి రాలేదని అసహనం వ్యక్తం చేశారు. ÷ఔటమి ప్రభుత్వంలో ఎటువంటి అరాచకాలు ఉండవని ఆయన కుండబద్దలు కొట్టారు. .. దయచేసి అసెంబ్లీకి రావాలని జగన్‌కు స్పష్టం చేశారు. అసెంబ్లీకి రాని వైసీపీ ఎమ్మెల్యేలకు.. ప్రజలు ఎందుకు ఓటు వేయాలంటూ బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్ రాజు సందేహం వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ ఆగస్టు 19 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** ఇందిరమ్మ ఇండ్లతో తెలంగాణ ప్రభుత్వం పేదవాడి సొతింటి కల నెరవేర్చుతుందని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.బుధవారం జైనథ్ మండలంలోని కరంజి, దీపాయిగూడ గ్రామంలోని ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారుల నివాసాలను సందర్శించారు.ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులు కరంజిలో బిక్కి గంగన్న లక్ష్మి ,దీపాయిగూడ లో మునిగేల అపర్ణ శ్రీనివాస్ దంపతుల కు చెందిన ఇందిరమ్మ ఇండ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్,జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ షాహిద్ అలీ,నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## హెచ్.ఐ.వి., ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి..

### జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్, ఆగస్టు19(నేటి మనదేశమే ప్రతినిధి)::**జిల్లాలో హెచ్.ఐ.వి. ఎయిడ్స్ వ్యాధి, లైంగిక సంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో పాలనాధికారి ఛాంబర్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నాగేంద్ర, ఇతర వైద్యాధికారులతో కలిసి ప్రచార గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో లైంగిక సంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వ్యాధులపై ఏవైనా సందేహాలు, ప్రమాద అవకాశం, వ్యాధి తెలుసుకొనేందుకు క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక వేలం.. తాసిల్దార్ సతీష్ కుమార్.



**పాపన్న పేట, ఆగస్టు 19: ( నేటి మన దేశమ్ ప్రతి నిధి)** పాపన్న పేట మండలంలోని కుర్తివాడ గ్రామంలో గత నెలలో పట్టుబడిన ఇసుకను మంగళవారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ సతీష్ కుమార్, ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 21వ తేదీన గ్రామంలో వివిధ చోట్ల 154 ట్రాక్టర్‌ల ఇసుకను అనుమతి లేకుండా నిల్వ ఉంచగా మైనింగ్ మరియు రెవెన్యూ అధికారులు సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్‌చేసిన ఇసుకను 25/08/2026 మంగళవారం ఉదయం 11గంటలకు గ్రామ పరిధిలో వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొని ఇసుకను దక్కించుకోవాలన్నారు

## బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుల నియామకం..



**జూబ్లీహిల్స్ ఆగస్టు 19 (నేటి మానదేశమ్ (ప్రతినిధి)** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) యువజన విభాగమైన భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం)లో జిల్లా స్థాయి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర వ్యాప్తంగా నూతన జిల్లా అధ్యక్షులను నియమించారు. బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు సూచనల మేరకు, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు గా వాల్డస్ భరత్ గౌడ్ ని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు భరత్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను యువతలో మరింత విస్తృతంగా తీసుకెళ్లడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడం లక్ష్యంగా పని చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పార్టీ నాయకులకు, హార్దిక శుభాకాంక్షలు తెలిపారు

# సర్వాయి పాపన్న పేరుతో సామాజిక న్యాయం మాట్లాడటం హాస్యాస్పదం

**బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కేసీఆర్ ప్రభుత్వం చేసిన మేలు ఏమిటో ప్రజలకు తెలుసు**

**ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పేరుతో గురుకులాలను కనుమరుగు చేయొద్దు**

**ప్రస్తుతం కొనసాగుతున్న గురుకులాలను యథావిధిగా కొనసాగించాలి**

**బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి**



**జగిత్యాల, ఆగస్టు 19(నేటి మన దేశమ్ ప్రతినిధి):** సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ జాతీయ పార్టీగా ఉన్నప్పటికీ, రాష్ట్రంలో మాత్రం రేవంత్‌రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తరహాలో పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన నాయకుడు కేసీఆర్ అని, ప్రజా ఉద్యమాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కులవృత్తుల అభివృద్ధికి, బలహీన వర్గాల సంక్షేమానికి, విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. కులవృత్తులను ప్రోత్సహించడంతో పాటు ఆయా వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు పెద్ద ఎత్తున గురుకుల విద్యాలయాలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కులవృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు ఆర్థికంగా చేయూత అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని జీవన్‌రెడ్డి తెలిపారు. గొర్రెల పంపిణీ పథకం ద్వారా కుటుంబ యూనిట్ కు సుమారు రూ.1.25 లక్షల విలువైన గొర్రెలను అందించామని, గీత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చెట్టు పన్నును రద్దు చేయడంతో పాటు మద్యం దుకాణాల్లో గీత కార్మికులకు రిజర్వేషన్ కల్పించామని చెప్పారు. రజకులు, నేత కార్మికులకు విద్యుత్ రాయితీలు కల్పించామని, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేశామని వివరించారు. వ్యవసాయానికి కులం, మతం ఉండదని పేర్కొన్న ఆయన.. రైతు కుటుంబాలకు భరోసా కల్పించేందుకు రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జగిత్యాల జిల్లాలో 700కు పైగా చెరువులు ఉన్నప్పటికీ, 200కు పైగా చెరువుల్లో చేప నారు పోయలేదని జీవన్‌రెడ్డి ఆరోపించారు. డిసెంబర్‌లో చేప నారు పంపిణీ చేస్తే మత్స్యకారులకు ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. సకాలంలో చేప నారు పంపిణీ చేసి మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 58 ఏళ్ల కాలంలో 261 గురుకుల పాఠశాలలు మాత్రమే ఉంటే, కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురుకుల విద్యా వ్యవస్థను భారీగా విస్తరించారని జీవన్‌రెడ్డి తెలిపారు. బీసీ గురుకులాలను 19 నుంచి 262కు, ఎస్సీ గురుకులాలను 134 నుంచి 268కు, ఎస్టీ గురుకులాలను 96 నుంచి 160కు పెంచినట్లు వివరించారు. మైనారిటీ గురుకులాలు కేవలం 12 ఉండగా, కేసీఆర్ పాలనలో వాటి సంఖ్యను 204కు పెంచినట్లు తెలిపారు. మొత్తంగా విద్యకు ప్రాధాన్యత ఇస్తూ 652 గురుకులాలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలనే ఆలోచన కూడా కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం గురుకుల వ్యవస్థను బలోపేతం చేయకుండా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పేరుతో వాటి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన 33 నెలల్లో ఒక్క కొత్త రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మించిందా? అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికే ఉన్న పాఠశాలలకు రంగులు వేసి తెలంగాణ మోడల్ స్కూళ్లుగా చూపించడం తప్ప కొత్తగా విద్యా మౌలిక వసతులు ఎంతవరకు కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నిర్మాణం పేరుతో భారీ కేంద్రీకరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్న పాఠశాలలను తరలించి ఒకే చోట ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇబ్బందులు కలుగుతాయని అన్నారు. సమాజంలో 50 శాతానికి పైగా బీసీల జనాభా ఉందని జీవన్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ అమలు విషయంలో ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో ముస్లింలతో కలిపి బీసీల జనాభా 61 శాతంగా ఉన్నట్లు తేలిందని, ప్రస్తుత ప్రభుత్వ సర్వేలో బలహీన వర్గాల జనాభా 46 శాతంగా చూపించారని ఆరోపించారు. జనాభా లెక్కల్లో బీసీల సంఖ్యను తగ్గించడం వెనుక ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ వర్గాలకు చెందిన మంత్రులు ప్రభుత్వ నిర్ణయాలపై ఎందుకు ప్రశ్నించడం లేదని జీవన్‌రెడ్డి నిలదీశారు. ముఖ్యమంత్రి ఏం చెబితే అదే చేయడానికి మంత్రులు ఉన్నారా? అని ప్రశ్నించారు. బీసీ జనాభా గణన, రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగ అవకాశాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంలో బీసీ జనాభా గణన విషయంలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కూడా ముందుకు రావడం లేదని విమర్శించారు. బీసీ డిక్లరేషన్ అమలుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రాంతాల వారీగా విద్యా సంస్థలను వికేంద్రీకరించడం అవసరమని జీవన్‌రెడ్డి అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలను కేంద్రీకరించే విధానాన్ని అవలంబిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ భూమి ఉన్న చోటే పాఠశాల నిర్మిస్తామని చెప్పడం ప్రభుత్వ ఆలోచనా విధానానికి అద్దం పడుతోందన్నారు. ఎక్కడికక్కడ పాఠశాల భవనాలు నిర్మిస్తే కాంట్రాక్టర్లకు, ప్రభుత్వ పెద్దలకు వచ్చే ప్రయోజనాలు తగ్గిపోతాయని, అందుకే భారీ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుల వైపు ప్రభుత్వం మొగ్గుచూపుతోందని ఆరోపించారు. సుమారు రూ.20 వేల కోట్ల విలువైన కాంట్రాక్టుల కోసమే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణం చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఎస్టీలకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ను 10 శాతానికి పెంచిందని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు. బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కేసీఆర్ పాలన సాగిందన్నారు. కులవృత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆయా వర్గాలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, విద్యా రంగంలోనూ ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న గురుకుల పాఠశాలలను యథావిధిగా కొనసాగిస్తూ, అవసరమైన చోట కొత్త భవనాలు నిర్మించాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురుకులాలను తరలించే ప్రయత్నాలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ విద్యా విధానం ఏమిటో ప్రభుత్వం ప్రజలకు పూర్తిగా వెల్లడించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలను కేవలం భవన నిర్మాణాలకే పరిమితం చేయకుండా, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల నియామకం, వసతులు, పాఠ్య విధానం తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి ఆదర్శంగా తీసుకోవాలని జీవన్‌రెడ్డి హితవు పలికారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు గుర్తుకు రావాలంటే ముఖ్యమంత్రి కార్యాలయంలో కేసీఆర్ చిత్రాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు జీవితంలో ఏనాడైనా తెలంగాణ జెండా పట్టారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌తో అడుగులో అడుగు వేసి తెలంగాణ ఉద్యమంలో పోరాడిన కేటీఆర్, హరీశ్‌రావులతో వారికి పోలిక ఏమిటని నిలదీశారు. ప్రజా జీవితం అంటే పదవులు అనుభవించడం కాదని, ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల కోసం పోరాటం చేయడమే నిజమైన ప్రజా జీవితమని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు, అమలు తీరును ప్రజలు పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన విద్యా విధానంపై స్పష్టత ఇవ్వాలని, ప్రస్తుతం కొనసాగుతున్న గురుకుల పాఠశాలలను యథావిధిగా కొనసాగిస్తూ, అవసరమైన చోట భవన నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గురుకులాలను తరలిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బలహీన వర్గాల విద్యా అవకాశాలను కాపాడేందుకు అవసరమైతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వొద్దినేని హరిచరణ్‌రావు, మున్నా, కోరుకంటి రాము, తోట హరీష్, శీలం ప్రవీణ్‌కుమార్, ఆయిల్నేని వెంకటేశ్వరరావు, జున్ను రాజేందర్, కళ్లేపల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, నేహాల్, శీలం సురేందర్, పోనిశెట్టి మహేష్, ధర రమేష్‌బాబు, ఆనంద్‌రావు, అబ్దుల్ బారి, నరేష్‌గౌడ్, సాయి, గుండా మధు, సన్నిత్‌రావు, నక్క జీవన్, హరి, శివ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోతే ప్రభుత్వ పతనం తప్పదు

**పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయొద్దు**

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి**

**కోరుట్ల, ఆగస్టు 19(నేటి మన దేశమ్ ప్రతినిధి):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, లేకపోతే విద్యార్థుల ఆగ్రహాన్ని ఎదుర్కొని ప్రభుత్వం పతనం కాక తప్పదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 97ను రద్దు చేసి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జగిత్యాల జిల్లా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం కోరుట్లలోని ప్రభాకర్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు సమీర్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విడుదల చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యా సంవత్సరం పూర్తయినప్పటికీ ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో పలువురు విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం సొంతంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువులకు నిధులు కేటాయించకపోతే పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యను ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం ద్వారా రాష్ట్రంలో సాంకేతిక విద్యను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని మణికంఠరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, ఏకపక్ష నిర్ణయాలతో వాటి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారని విమర్శించారు. పాలిటెక్నిక్ కళాశాలల భూములు,




స్థలాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 'శక్తి పాలసీ'ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయకుండా, వాటికి అవసరమైన మౌలిక వసతులు, అధ్యాపకులు, సాంకేతిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్నప్పటికీ రాష్ట్ర విద్యారంగం అభివృద్ధికి తగిన ప్రాధాన్యం లభించడం లేదని మణికంఠరెడ్డి విమర్శించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు తగ్గించడం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలను ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. విద్యారంగానికి నిధులు కేటాయించకుండా ఇతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యా సంస్థలు తీవ్రంగా నష్టపోతున్నాయని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను మొత్తం వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో విద్యార్థులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల ఆగ్రహానికి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈసమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సమీర్, జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్, జిల్లా ఉపాధ్యక్షుడు మంద రాకేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గని మనోజ్, ముజీబ్, రాజీవ్, విష్ణుతేజ తదితరులు పాల్గొన్నారు.

## జీవో నంబర్ 97ను రద్దు చేయాలి

**పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి**

**కోరుట్లలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో**




**కోరుట్ల, ఆగస్టు 19(నేటి మన దేశమ్ ప్రతినిధి):** పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రతికూలంగా ఉన్న జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏబీవీపీ కోరుట్ల శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి పట్టణంలోని కొత్త బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జగిత్యాల జిల్లా కన్వీనర్ మడవేణి సునీల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97 విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపేలా ఉందని ఆరోపించారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా శక్తి కాలేజీని పాలిటెక్నిక్ కళాశాలతో కలిపే ప్రతిపాదనను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని సునీల్ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల స్వయంప్రతిపత్తి, విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా ప్రమాణాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలను తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులను కాలరాసే నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహదేవ్, మనీష్, రశ్విత్, శ్రీతిన్, మణితేజతో పాటు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణను పరామర్శించిన హరీశ్‌రావు, మహిపాల్‌రెడ్డి

**గుండె శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిపై ఆరా**

**పటాన్‌చెరు:ఆగస్టు 19 (నేటి మనదేశమ్):** ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే శ్రీ సత్యనారాయణను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బుధవారం సాయంత్రం పరామర్శించారు. సత్యనారాయణను కలిసిన ఇరువురు నేతలు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం ఎలా



ఉందనే విషయంపై వైద్యుల వివరాలను కూడా ఆరా తీసిన హరీశ్‌రావు, మహిపాల్‌రెడ్డి ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలను పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ కుటుంబ సభ్యులతోనూ మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఆయనకు అందుతున్న వైద్య సేవలపై కూడా వివరాలు తెలుసుకున్నారు. సత్యనారాయణ త్వరితగతిన కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాజీవితంలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన సందర్భంగా పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

# 'మల్లెపూల పల్లకి' విమర్శలపై దర్శకుడేమన్నాడంటే?



అయ్యప్ప స్వామి భక్తులు పాడుకునే పాటల్లో 'మల్లెపూల పల్లకి'కి ఉన్న ఆదరణే వేరు. అయ్యప్ప మాల సీజన్ మొదలైందంటే ఈ పాట ఊర్లలో మార్మోగిపోతుంటుంది. మాస్ రాజా రవితేజను అయ్యప్ప భక్తుడిగా చూపిస్తూ 'ఇరుముడి' అనే సినిమా తీసిన మేకర్స్.. ఈ సినిమాలోనూ 'మల్లెపూల పల్లకి' పెడుతున్నారన్న వార్త బయటికి రావడంతో ఈ సాంగ్‌కు ముందే మంచి హైప్ వచ్చింది. పాట ఒక రేంజిలో ఉంటుందని ఊహించుకున్నారు. కానీ తీరా చూస్తే ఈ పాటను రిలీజ్ చేసినపుడు మిక్స్డ్ రెస్పాన్స్ వచ్చింది. ఒరిజినల్ సాంగ్‌ను యథాతథంగా కంపోజ్ చేసి ఉన్నా అదిరిపోయేదని.. జి.వి.ప్రకాష్ కుమార్ లాంటి టాప్ మ్యూజిక్ డైరెక్టర్ ఒరిజినల్ ట్యూన్‌కు సరితూగేలా సాంగ్ కంపోజ్ చేయలేదని, ఒరిజినల్ సింగర్ దప్పు శ్రీనుతోనే ఈ పాట పాడించినా అసలు పాటను మ్యాచ్ చేయలేకపోయారని విమర్శలు వచ్చాయి. సినిమాలో ఈ పాట డీజే వెర్షన్ ఉంటుందని, అది పెద్ద సర్ప్రైజ్ అని మేకర్స్ అంటున్నప్పటికీ.. జనాల్లో అంచనాలు పెరగట్లేదు. 'మల్లెపూల పల్లకి' సాంగ్ మీద వస్తున్న విమర్శలపై దర్శకుడు శివ నిర్వాణ తాజాగా స్పందించాడు. ఒరిజినల్ సాంగ్‌లో ఉన్న బేస్ వాయిస్‌కు 'ఇరుముడి'లో ఉన్న వాయిస్ సరితూగలేదన్న అభిప్రాయాన్ని శివ నిర్వాణ అంగీకరించాడు. అసలు పాటను పాడిన దప్పు శ్రీనుతోనే పాడించినా.. ఈ తేడా ఎందుకు వచ్చిందో అతను వివరించే ప్రయత్నం చేశాడు. ఒరిజినల్ సాంగ్‌ను దప్పు శ్రీను 15 ఏళ్ల కిందట పాడాడని.. ఇప్పుడు ఆయన వయసు పెరిగిందని, స్వరం మారిందని.. అందుకే ఒకప్పట్లా బేస్ వాయిస్ లేకపోవచ్చని అతనన్నాడు. ఒరిజినల్ సింగర్‌తో పాడించి గౌరవించాలన్న ఉద్దేశంతోనే దప్పు శ్రీనుతో ఈ పాట పాడించామని శివ తెలిపాడు. మరోవైపు అయ్యప్పస్వామి మాల నేపథ్యంలోనే సాగే మలయాళ చిత్రం 'మాలికాపురం'తో 'ఇరుముడి'కి వస్తున్న పోలికల గురించి కూడా శివ నిర్వాణ స్పందించాడు. రెంటినీ పోల్చడంలో ఆశ్చర్యం లేదని.. కానీ తన సినిమాలో ఏం కంటెంట్ ఉందో తనకు తెలుసు కాబట్టి తాను ఎప్పుడూ ఈ పోలికల గురించి కంగారుపడలేదని... తన సినిమా యునీక్‌గా ఉంటుందని.. ఈ విషయాన్ని ప్రేక్షకులు కూడా అంగీకరిస్తారని అతను ధీమా వ్యక్తం చేశాడు.




## టాక్సిక్ కొంచెం జాగ్రత్త పడాల్సిందే



నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించనప్పటికీ టాక్సిక్ తెలుగు డబ్బింగ్ వెర్షన్ కి టికెట్ రేట్ల పెంపు తీసుకుంటారనే టాక్ బయటికి రావడం ఆలస్యం సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. గతంలో కూలి, కాంతార లాంటి వాటికి కూడా హైక్స్ ఇచ్చారు కానీ ఈసారి పరిస్థితి కాస్త భిన్నంగా కనిపిస్తోంది. ఏ మాత్రం తొందరపడినా దాని తాలూకు పరిణామాలు నేరుగా ఓపెనింగ్స్ మీద పడేలా ఉన్నాయి. టాక్సిక్ ఈ విషయంలో కొంచెం జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎందుకంటే పెద్ది తర్వాత అంటే జూన్ మూడో వారం నుంచి ఇప్పటిదాకా తెలుగు ప్రేక్షకులు ఎలాంటి టికెట్ రేట్ల పెంపు లేకుండా బోలెడు సినిమాలు చూశారు. మా ఇంటి బంగారం, లెనిన్, చెన్నై లవ్ స్టోరీ, విశ్వనాథ్ అండ్ సన్స్, ఒడిస్సి,. స్పైడర్ మ్యాన్ బ్రాండ్ న్యూ డే మొదలైనవన్నీ విజయవంతంగా మాములు ధరలకే నిర్మాతలకు కనకవర్షం కురిపించాయి. ఆడియన్స్ కూడా ఇదేదో బాగుందని వాటికి బాగా అలవాటు పడ్డారు. ఇరుముడికి కూడా పెంపు అడగలేదు. ఇలాంటి పరిస్థితుల్లో హఠాత్తుగా టాక్సిక్ కనక పెంపు తీసుకుంటే రిస్క్ అవుతుంది. ఎందుకంటే ఇది తెలుగు సినిమా కాదు. తెలుగు వాళ్ళు తీయలేదు. తెలుగు హీరో నటించలేదు. టెక్నీషియన్స్ ఎవరూ తెలుగు వాళ్ళు కాదు. అంతెందుకు టాలీవుడ్ యాక్టర్స్ ఎవరున్నారు అంటే తక్కున సమాధానం దొరకదు. అలాంటప్పుడు స్పెషల్ ట్రీట్ మెంట్ ఎందుకు ఇవ్వాలనేది మూవీ లవర్స్ ప్రశ్న. జిఓ వస్తుందనే ప్రచారం నేపథ్యంలో ఇంత చర్చ జరుగుతోంది. ఈ విషయం గురించే కాదు టాక్సిక్ లో బోల్డ్ కంటెంట్ మీద కూడా జనాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. హీరో యష్ అంత ఏముందవని, నేను ఎవరినీ ముద్దు కూడా పెట్టుకోలేదని ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. కానీ కియారా అద్వానీ, తారా సుతారియా పాటల్లో చూస్తేనేమో ఫుల్లుగా రొమాన్స్ ఉంది. ఇక్కడ లింక్ మిస్ అవుతోంది. ఏది ఏమైనా టికెట్ రేట్ల హైక్ తీసుకున్నా తీసుకోకపోయినా టాక్సిక్ మటుకు యునానిమస్ టాక్ తెచ్చుకుంటేనే మనదగ్గర వర్కౌట్ చేసుకోగలదు.

# రజిని సినిమాలో విలన్... రాపో పెద్ద రిస్కు?



సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న ధర్మన్ షూటింగ్ మంచి ఊపు మీద ఉంది. ఇప్పటికే పలు వాయిదాలు, డైరెక్టర్ల మార్పుతో బాగా లేట్ అయిన ఈ ప్రాజెక్టుని వచ్చే సంక్రాంతి బరిలో దింపాలనే సంకల్పంతో నిర్మాత కమల్ హాసన్ తన టీమ్ ని పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటికే ఒక షెడ్యూల్ అయిపోగా రజని బ్రేక్స్ ఇవ్వకుండా నిత్యం అందుబాటులో ఉంటున్నారు. తాజాగా ఒక అప్డేట్ టాలీవుడ్ జనాలకు షాక్ కలిగించేలా ఉంది. చెన్నై సమాచారం మేరకు ధర్మన్ లో నెగటివ్ షేడ్స్ ఉన్న ఒక ముఖ్యమైన పాత్రకు రాపో రామ్ పోతినేని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. అధికారికంగా ప్రకటించలేదు కానీ దాదాపు ఓకే అయినట్టు వినికిడి. రజని కూతురిగా నటిస్తున్న శ్రీలీలకు జోడిగా రామ్ ఉంటాడని, చాలా పవర్ ఫుల్ ఎపిసోడ్స్ రజనితో పాటు ఉంటాయని అంతర్గత వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. అంత పెద్ద కోలీవుడ్ స్టార్ తో నటించడం రామ్ కు ఒక ప్రత్యేక జ్ఞాపకంగా నిలిచిపోతుంది కానీ ఒక రిస్క్ ఉంది. రజనీకాంత్ కూలిలో నాగార్జున ప్రతినాయకుడిగా చేయడం ఆయనకు పెద్ద మేలు కలిగించలేదు. కారణం ఆ పాత్రను డిజైన్ చేసిన తీరు. విక్రమ్ రోలెక్స్ రేంజ్ లో పేలుతుందనుకుంటే అతి మాములుగా వచ్చింది. దానికి తోడు కూలి ఫ్లాప్ కావడం నాగ్ కు ఉపయోగపడలేదు. అంతకు ముందు అజిత్ వలిమైలో టాలీవుడ్ యూత్ హీరో కార్తికేయ విలన్ గా చేయడం వల్ల ఎలాంటి బెనిఫిట్ దక్కలేదు. మరి రామ్ ఇవన్నీ ఆలోచించే ఒప్పుకున్నాడంటే ఏదో పవర్ ఫుల్ టచ్ ఉంటుంది. ఇంకా అఫీషియల్ గా చెప్పలేదు కానీ కన్ఫర్మేషన్ కోసమైతే ఇంకొద్ది రోజులు వేచి చూడాలి. స్వీయ దర్శకత్వంలో తన ఇరవై మూడో సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్న రామ్ ఒకవేళ నిజంగా ధర్మన్ చేసే పనైతే డేట్స్ ఎలా అడ్జస్ట్ చేస్తారో చూడాలి. సెతస్కోప్ పట్టుకునే డాక్టర్ కత్తులు పట్టుకుని ఎందుకు రక్తపాతం సృష్టించాల్సి వచ్చిందనే పాయింట్ మీద ధర్మన్ రూపొందుతోంది. యాక్షన్,. వయొలెన్స్ ఈసారి పుష్కలంగా ఉంటాయట. దీనికన్నా ముందు జైలర్ 2 అక్టోబర్ రెండో వారంలో రిలీజ్ కానుంది.

## అభిమాని చిరకాల కోరిక తీర్చిన రామ్



సినీ హీరోల మీద ఫ్యాన్స్ వీరాభిమానానికి సంబంధించి ఎన్నో ఉదంతాలు చూశాం. కానీ ఇది చాలా చిత్రమైన వ్యవహారం. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శశిభవ్యత అనే అమ్మాయి లాఫోరా మయోక్లోనిక్ ఎపిలెప్సీ అనే అరుదైన జన్యు పరమైన వ్యాధితో బాధ పడుతోంది. తరచూ ఫిట్స్ రావడం, నాడీ వ్యవస్థ దెబ్బ తినడంతో మంచానికే పరిమితం అయిన 18 ఏళ్ల ఈ అమ్మాయికి టాలీవుడ్ యువ కథానాయకుడు రామ్ అంటే వల్లమాలిన అభిమానం. మతిస్థిమితం కూడా సరిగా లేని ఈ అమ్మాయికి రామ్ పేరు చెబితే.. ఒంట్లో ఉత్సాహం వస్తోంది. శశిభవ్యత తల్లిదండ్రులు.. ఆమెకు రామ్ వీడియోలు, ఫొటోలు చూపించి అన్నం తినిపించి మందులు వేస్తున్నారట. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత.. రామ్ దృష్టికి వచ్చింది. ఈ అభిమాని పరిస్థితి చూసి కదిలిపోయిన రామ్.. వెంటనే స్పందించాడు. ఆ బాలికతో రామ్ వీడియో కాల్ మాట్లాడాడు. ఆమె తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాడు. శశిభవ్యతకు అవసరమైన మందులు, ఇతర ఖర్చులు అన్నీ ఇకపై తానే భరిస్తానని రామ్ తెలిపాడు. ఆమె రిపోర్టులు అన్నీ కూడా తనకు అందాయని.. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతుగా ప్రయత్నిస్తానని రామ్ చెప్పాడు .



# బిజినెస్ న్యూస్



## ఏడో రోజూ నష్టాల్లో నిఫ్టీ.. 24,100 దిగువకు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, ఇతర మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సూచీలు నష్టపోయాయి. దీంతో నిఫ్టీ వరుసగా ఏడో రోజూ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 77,218.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,235.46) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లో కొనసాగిన సూచీ.. ఓ దశలో 76,822.89 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 325.78 పాయింట్ల నష్టంతో 76,909.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 76.60 పాయింట్ల నష్టంతో 24,078 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.75గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, సన్‌ఫార్మా, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91 డాలర్ల స్థాయికి చేరగా.. బంగారం ఔన్సు ధర 4,368 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## అదరగొట్టిన బెహరీలాల్ ఇంజినీరింగ్.. 63% ప్రీమియంతో లిస్టింగ్




ఐరన్ అండ్ స్టీల్ తయారీ కంపెనీ బెహరీలాల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ మదుపర్లకు లాభాల వర్షం కురిపించింది బుధవారం దాదాపు 63 శాతానికి పైగా ప్రీమియంతో ఈ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.285 కాగా 60.70 శాతం లాభంతో బీఎస్‌ఈలో రూ.458 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఎన్ఎస్ఈలోనూ 63.15 శాతం ప్రీమియంతో రూ.465 వద్ద ట్రేడింగ్ మొదలెట్టాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,135.22 కోట్లకు చేరింది. కంపెనీ ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి కూడా భారీ డిమాండ్ వచ్చింది. చివరి రోజు నాటికి 108.44 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. రూ.302 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఆగస్టు 12న ఐపీఓకు వచ్చింది. ఆగస్టు 14న సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. ఒక్కో షేరు ధర రూ.271–285గా కంపెనీ నిర్ణయించింది.

35% ప్రీమియంతో షిప్ రాకెట్ అరంగేట్రం ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్ కూడా వాటాదారులకు మంచి లిస్టింగ్ లాభాలను అందించింది. 35 శాతం ప్రీమియంతో కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.97గా కంపెనీ నిర్ణయించగా.. బుధవారం బీఎస్‌ఈలో 33.50 శాతం లాభంతో రూ.129.50 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఎన్ఎస్ఈలో 35 శాతం ప్రీమియంతో రూ.131 వద్ద ట్రేడింగ్ మొదలెట్టాయి. దీంతో కంపెనీ విలువ రూ.9,901.60 కోట్లకు చేరింది. ఈ కంపెనీ రూ.1617.5 కోట్లు నిధుల సమీకరణ లక్ష్యంతో ఆగస్టు 12న ఐపీఓకి వచ్చింది. 14న సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. చివరి రోజు నాటికి 99.38 రెట్ల బిడ్డింగ్ నమోదు చేసింది. ధరల శ్రేణి రూ.92–97గా నిర్ణయించింది .

## టాటా సన్స్ ఏజీఎం వాయిదా.. వందేళ్లలో తొలిసారి




మంగళవారం జరగాల్సిన టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) వాయిదా పడింది. సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ), సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్(ఎస్‌డీటీటీ) తమ ప్రతినిధిని నామినేట్ చేయలేకపోవడంతో, ఏజీఎంకు కోరమ్ (కనీస సభ్యులు) లేదు. దీంతో సమావేశాన్ని వాయిదా వేశారు. వందేళ్లలో టాటా సన్స్ ఏజీఎం వాయిదా పడడం ఇదే తొలిసారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌లో ఈ రెండు ట్రస్టులకు 51% పైగా వాటా ఉంది. ఎందుకు ఇలా జరిగిందంటే: మహారాష్ట్ర ఛారిటీ కమిషన్ ఆదేశాల ప్రకారం, ఎటువంటి ప్రధాన నిర్ణయాలు తీసుకోవడం కానీ, సమావేశం నిర్వహించడం కానీ ఎస్ఆర్‌టీటీ చేపట్టరాదు. దీంతో మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు జరగాల్సిన ఏజీఎంకు తన ప్రతినిధిని ఎస్ఆర్‌టీటీ నామినేట్ చేయలేకపోయింది. దీంతో కనీసం అయిదుగురు సభ్యులు వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన ఏజీఎంను వాయిదా వేయక తప్పలేదు. పరిశీలకులు ముందుగానే దీన్ని ఊహించినా, టాటా సన్స్ మాత్రం మంగళవారం వరకు నిర్ణయం తీసుకోలేదు.

## ఆర్‌బీఐ కొత్త రూల్.. హోమ్‌లోన్ EMIలు మారనున్నాయా?



హోమ్‌లోన్‌లకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రతిపాదనతో ముందుకొచ్చింది. గృహ రుణాల వడ్డీ రేట్ల రీసెట్‌కు సంబంధించి తాజాగా డ్రాఫ్ట్ ఫ్రేమ్‌వర్క్‌ను విడుదల చేసింది. దీనివల్ల ఇప్పటికప్పుడు రుణ గ్రహీతలపై ప్రభావం పడనప్పటికీ.. వచ్చే ఏడాది నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. ఇంతకీ ఏమిటీ నిబంధన? దీనివల్ల ఏమిటీ ప్రయోజనం? సాధారణంగా హోమ్‌లోన్‌లు ఫ్లోటింగ్ రేట్‌తో ముడిపడి ఉంటాయి. అంటే, ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను సవరించినప్పుడు దాన్ని అనుసరించి రుణ రేట్లు మారుతుంటాయి. అయితే, అన్ని బ్యాంకులూ ఒకేసారి మార్చవు. కొన్ని సందర్భాల్లో ఇవి మారడానికి ఏడాది సమయం పడుతోంది. దీనివల్ల తగ్గిన వడ్డీ ప్రయోజనం రుణ గ్రహీతలకు చేరడంలో ఆలస్యమవుతోంది.

**తీసుకొస్తున్న మార్పేంటి?**

ఫ్లోటింగ్ వడ్డీ రేట్ల రీసెట్ సమయం మూడు నెలలకు మించకూడదని ఆర్‌బీఐ తన తాజా నిబంధనల్లో పొందుపరిచింది. అంటే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించినప్పుడు వేగంగా ఆ ప్రయోజనం దక్కుతుంది. అదే సమయంలో వడ్డీ రేట్లు పెంచినప్పుడూ ఇదే నియమం వర్తిస్తుంది. దీనిపై సెప్టెంబర్ 11 వరకు అభిప్రాయాలను సేకరిస్తోంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

**వ్యక్తిగత రుణాలకు వర్తిస్తుందా?**

ఆర్‌బీఐ తీసుకొస్తున్న నిబంధనలు కేవలం ఫ్లోటింగ్ రేట్ రుణాలకు మాత్రమే. గృహ రుణాలకు మాత్రమే ఈ వడ్డీ రేట్లు ఉంటాయి. వ్యక్తిగత, ఆటో రుణాలకు స్థిర వడ్డీ రేటు అమల్లో ఉంటుంది. కాబట్టి ఆర్‌బీఐ తీసుకొస్తున్న ఈ మార్పు వల్ల వ్యక్తిగత రుణాలపై ప్రభావం ఉండదు. కాబట్టి ఈఎంఐలలో ఎలాంటి మార్పూ ఉండదు. కొత్తగా తీసుకొనే గృహ రుణ వినియోగదారులు, ఇప్పటికే హోమ్‌లోన్ తీసుకున్నవారికే ఈ నిబంధన వర్తించనుంది.

# ఫొటో జర్నలిస్టులు కాలానికి సాక్షులు

**- ఫొటో, వీడియో జర్నలిస్టుల సేవలు అమూల్యం**
**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్**



**కరీంనగర్, ఆగస్టు 19: నేటి మన దేశమ్ ప్రతినిధి** "ఫోటో, వీడియో ఒక క్షణాన్ని మాత్రమే బంధించవు.. ఆ క్షణం వెనుక ఉన్న చరిత్రను భద్రపరుస్తాయి. ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు కెమెరా పట్టుకున్న వ్యక్తులు మాత్రమే కాదు.. కాలానికి సాక్షులు" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఫోటో, వీడియో జర్నలిస్టులను బండి సంజయ్ సన్మానించారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశంతో కలిసి మీడియాతో మాట్లాడారు.వెయ్యి పదాలు చెప్పలేని భావాన్ని ఒక్క ఫోటో చెప్పగలదని, ప్రజాస్వామ్యంలో ప్రజలకు నిజాన్ని చూపించడంలో ఫోటో, వీడియో జర్నలిస్టుల పాత్ర కీలకమని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాల ప్రభావాన్ని ప్రజల జీవితాల్లో కెమెరా ప్రపంచానికి చూపిస్తుందని పేర్కొన్నారు. సోషల్ మీడియా, ఏఐ యుగంలో మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైరల్ కావడం కంటే నిజాన్ని చూపించడమే ముఖ్యమన్నారు.

**సమస్యలను పరిష్కరించాలి** ఫోటో, వీడియో జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని బండి సంజయ్ అన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, వైద్య సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. వారికి ఇళ్ల స్థలాలతోపాటు ఇళ్లు కల్పించాలని, మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్లు, ఉచిత వైద్యం** తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే అర్హులైన జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు నిర్మించి ఇస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందేలా హెల్త్ కార్డులు ఇస్తామని, కనీస వేతనాలతోపాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్లకు సన్మానం



**కామారెడ్డ్,ఆగస్టు 19.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**కామారెడ్డి లో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డిలోని మెహర్ బాబా గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణానికి చెందిన ప్రతిభావంతులైన 10 మంది ఫోటోగ్రాఫర్లను ఘనంగా సన్మానించారు. సమాజంలో ఫోటోగ్రఫీ రంగం అందిస్తున్న సేవలను గుర్తిస్తూ, ఫోటోగ్రాఫర్లను అభినందించారు.కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాలరాజు, సెక్రటరీ గోపి, ట్రెజరర్ ప్రసాద్, అలాగే రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి అధ్యక్షులు రోటేరియన్ సబ్బని కృష్ణ హరి, సెక్రటరీ రోటేరియన్ సోమిశెట్టి సంతోష్ కుమార్, ట్రెజరర్ రోటేరియన్ మటూరి భైరయ్య తదితరులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఫోటోగ్రాఫర్లు తమ కెమెరా ద్వారా సమాజంలోని ముఖ్యమైన సంఘటనలను, సంస్కృతి,సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు భద్రపరుస్తున్నారని కొనియాడారు. ఫోటోగ్రఫీ రంగంలో ప్రతిభ కనబరుస్తున్న వారిని ప్రోత్సహించడం రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యాలలో ఒకటని తెలిపారు.రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఫోటోగ్రాఫర్లలో నూతన ఉత్సాహాన్ని నింపింది.

# ఉర్సు ఉత్సవాలకు ముస్తాబు

**ఈ నెల 26 నుంచి ప్రారంభం**
**దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరూల్ ఖాద్రీ సహేబ్**




**ఆగస్టు 19 (నేటి మనదేశమ్):** పుల్కల్ మండలం సింగూరు లోని హజ్రత్ మహ్మద్ ఫీర్ బాబాన్ షా వలీ దాదా హజత్ 81వ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 26, 27, 28 తేదీల్లో వైభవంగా జరగనున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉర్సు ఉత్స వాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సహేబ్ తెలిపారు. ఈ ఉత్సవాలకు కులమ తాలతకు అతీతంగా వేలాది మంది ప్రజలు పాల్గొం టారని ఆయన తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దర్గాను రంగురంగుల దీపాలతో అందంగా అలంకరించమన్నారు. 26వ తేదీన గంధం, చాదర్ ఇంటి నుండి తీసుకొని దర్గా లోకి తీసికెళ్లి కీలక ఘట్టాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు. 27వ తేదిన కబడ్డీ పోటీలు సాయి కుమార్ సమక్షం లో నిర్వహిస్తామన్నారు. అదే రోజు సాయంత్రం నాతే మై ఫీల్ సమ మరియు అన్నదాన కార్య క్రమం ఉంటుదన్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతి థులుగా అన్నసాగర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ సుఫీ షా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ ఉర్ఫ్ జహీద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# టెక్నాలజీ అభివృద్ధి విద్యకు ఉపయోగపడాలి..

**ఆధునిక సాంకేతికతను ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి వినియోగించాలి..**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19,(నేటి మనదేశమ్)**,టెక్నాలజీ అభివృద్ధి చెందడం స్వాగతించదగిన విషయమేనని, అయితే ఆధునిక సాంకేతికతను విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, యువత భవిష్యత్తుకు ఉపయోగపడేలా వినియోగించాలని ఫోటోగ్రాఫర్లు కోరారు.సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, సంవత్సరాలుగా కళగా, వృత్తిగా కొనసాగుతున్న ఫోటోగ్రఫీ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఫోటోగ్రాఫర్లపై ఆధారపడిన అనేక పనులు ప్రస్తుతం మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా తదితర సాంకేతిక మార్పుల కారణంగా తగ్గిపోతున్నాయని తెలిపారు. దీంతో ఫోటోగ్రఫీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.టెక్నాలజీని వ్యతిరేకించడం లేదు టెక్నాలజీ అభివృద్ధిని అడ్డుకోవడం తమ ఉద్దేశం కాదని, అయితే ఆధునిక సాంకేతికత కారణంగా ఒక వృత్తి పూర్తిగా దెబ్బతినకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వృత్తి ఫోటోగ్రాఫర్లకు ఆధునిక సాంకేతికతపై శిక్షణ, నూతన పరికరాల వినియోగంపై అవగాహన, ప్రభుత్వ ప్రోత్సాహం, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.సోషల్ మీడియా రంగాన్ని ప్రోత్సహిస్తున్న తరహాలోనే సమాజంలోని ముఖ్యమైన ఘట్టాలను కెమెరాల్లో శాశ్వతంగా భద్రపరుస్తున్న వృత్తి ఫోటోగ్రాఫర్లను కూడా ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు.ఫోటోగ్రఫీ కళ మాత్రమే కాదు.. జీవనాధారం టెక్నాలజీ అభివృద్ధి చెందాలని, అది విద్యకు, ఉపాధికి ఉపయోగపడాలని, అయితే ఫోటోగ్రాఫర్ల వృత్తికి భారంగా మారకూడదని వారు పేర్కొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా ప్రభుత్వం ఫోటోగ్రాఫర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, ఆధునిక శిక్షణ, సంక్షేమ కార్యక్రమాలు అందించి ఈ వృత్తిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు."ఫోటోగ్రఫీ ఒక కళ మాత్రమే కాదు.. ఎన్నో కుటుంబాలకు జీవనాధారం" అని ఫోటోగ్రాఫర్లు పేర్కొన్నారు.

# సెప్టెంబరు 7 నుంచి జీడీఎస్‌ల నిరవధిక దీక్ష

**- వేధింపులు, అక్రమ తొలగింపులకు వ్యతిరేకంగా బీజీడీకేఎస్ ఆందోళన**



**వేములవాడ, ఆగస్ట్ 19: నేటి మన దేశమ్ ప్రతినిధి** గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఎంఎస్ అనుబంధ భారతీయ గ్రామీణ డాక్ కర్మచారి సంఘ్ (బీజీడీకేఎస్) తెలంగాణ సర్కిల్ నిరవధిక నిరాహార దీక్షకు సిద్ధమైంది. సెప్టెంబరు 7 నుంచి హైదరాబాద్‌లోని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ (సీపీఎంజీ) కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సహాయ నిరాకరణ ఉద్యమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.గత రెండేళ్లుగా జీడీఎస్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని బీజీడీకేఎస్ తెలంగాణ సర్కిల్ అధ్యక్షుడు జె.కిషన్, కార్యదర్శి ఎస్.వినయ్ సుధీర్ తెలిపారు. ఉద్యోగులపై మానసిక వేధింపులు పెరిగాయని, రూల్-19ను దుర్వినియోగం చేస్తూ అకారణంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు.హనుమకొండ డివిజన్ అధ్యక్షుడు వి.అశోక్ తొలగింపు ఉత్తర్వులను రద్దు చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత మూడున్నరేళ్లలో అన్యాయంగా తొలగించిన జీడీఎస్‌ల కేసులను సుమోటోగా సమీక్షించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, వారిపై నమోదైన పోలీసు కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. హైదరాబాద్ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ సుమిత అయోధ్యను ఇతర విభాగానికి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.జీడీఎస్‌లకు చట్టబద్ధమైన పనివేళలను అమలు చేసి, బ్రాంచ్ ఆఫీసు సమయాలకు అనుగుణంగా రోజుకు నాలుగు నుంచి ఐదు గంటలకే పని పరిమితం చేయాలని కోరారు. కార్యాలయ వేళల అనంతరం మేళాలు, మార్కెటింగ్ కార్యక్రమాలు, సమావేశాలు, ఆన్‌లైన్ గూగుల్ మీట్‌ల పేరుతో ఒత్తిడి చేయడం నిలిపివేయాలని తెలిపారు. ఖాతాల ప్రారంభం, స్పీడ్ పోస్టులు, స్టాంపుల విక్రయాలపై విధిస్తున్న కృత్రిమ టార్గెట్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా డీం0 డెలివరీ కోసం ఒత్తిడి చేయకూడదని, పరిస్థితులకు అనుగుణంగా డీం1 లేదా డీం2 డెలివరీ విధానం అమలు చేయాలని కోరారు. 2023 నుంచి సబ్‌స్టిట్యూట్‌లకు పెండింగ్‌లో ఉన్న అలవెన్సులు, వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.సమస్యలను పరిష్కరించడంలో పోస్టల్ శాఖ విఫలమైతే సెప్టెంబరు 7 నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఆందోళన కారణంగా పోస్టల్ సేవలకు అంతరాయం ఏర్పడితే ఈ అందుకు పోస్టల్ శాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# నోటీసులు జారీకి చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సి.సుదర్శన్ రెడ్డి**




**ఆసిఫాబాద్, ఆగస్టు 19 (నేటి మనదేశమ్):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అనమలిస్ జాబితాలో గల ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సి.సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా ఎన్యువరేషన్ ఫారాలలో పొందుపరిచిన వివరాలలో వ్యత్యాసం ఉన్న అనమలిస్ జాబితాలో గల వారికి నోటీసులు జారీ ప్రక్రియను చేపట్టి సంబంధిత ఓటరుకు అందించి వారి సంతకం తీసుకోవాలని తెలిపారు. నోటీసులో విచారణ ప్రదేశం, తేదీ ఉండాలని, నిర్ణీత గడువులోగా నోటీసుల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల ద్వారా నోటీసులు అందించి సరైన ఆధారాలతో విచారణ ప్రదేశానికి ఓటర్లు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 2 నియోజకవర్గాలలో సుమారుగా 94 వేల మంది అనమలిస్ ఓటర్లు ఉన్నారని, వారికి ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వర ఆలయంలో నూతన డొనేషన్ కౌంటర్లు



**వేములవాడ, ఆగస్ట్ 19: నేటి మన దేశమ్ ప్రతినిధి** శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శాశ్వత పూజల డొనేషన్ కౌంటర్లను ఆలయ ఈవో ఎల్. రమాదేవి, డీఈవో నవీన్‌కుమార్, ఈఈ రాజేష్ ప్రారంభించారు. డొనేషన్ కౌంటర్, ప్రోటోకాల్ కార్యాలయం పక్కన ప్రచార శాఖ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌంటర్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఈవో ఎల్. రమాదేవి రూ.1,116, ఈఈ రాజేష్ రూ.1,116 విరాళంగా అందజేసి తొలి డొనేషన్లు నమోదు చేయించారు.కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. ఈ వివరాలను దేవస్థానం పీఆర్వో పెరిక శ్రీనివాస్ వెల్లడించారు.

# శానిటేషన్ పనులపై చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ



**కామారెడ్డ్,ఆగస్టు 19. (నేటి మనదేశమ్ ప్రతినిధి)** జిల్లా కేంద్రంలోని 1వ, 17వ వార్డుల్లో కొనసాగుతున్న శానిటేషన్ (పారిశుధ్య) పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, రోడ్లు, డ్రైనేజీల శుభ్రత తదితర అంశాలను చైర్పర్సన్ పరిశీలించారు. శానిటేషన్ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా నిరంతరం పర్యవేక్షించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు.ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని చైర్‌పర్సన్ కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్స్ గడ్డం మహేష్ ,లోలం శ్రీనివాస్ ,కమిషనర్ పర్వతాలు, డి ఈ హన్మంతా రావు, ఏ ఈ వేణు ప్రసాద్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, నాయకులు అమీర్ ,శ్రీకాంత్, మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్స్, శానిటేషన్ సిబ్బంది, సంబంధిత వార్డుల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# విశ్వకర్మ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అరుణ్ తేజ చారి



**సిరిసిల్ల, ఆగస్ట్ 19: నేటి మన దేశమ్ ప్రతినిధి** సిరిసిల్ల జిల్లా విశ్వకర్మ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బ్రహ్మశ్రీ దూరిశెట్టి అరుణ్ తేజ చారిని నియమించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మశ్రీ నోండ్ల సంతోష్ చారి ఆధ్వర్యంలో, రాష్ట్ర ఈసీ మెంబర్ బ్రహ్మశ్రీ కానసల అరుణ్ చారి సమక్షంలో ఈ నియామకం జరిగింది.దుర్శెట్టి అరుణ్ తేజ చారి ఎన్నో సంవత్సరాలుగా సంఘ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సేవలందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ డైరెక్టర్‌గా అంతర్జాతీయ మానవ హక్కుల సంగం తెలంగాణ జనరల్ సెక్రటరీ గా ఆపదలో ఎవరికీ బ్లడ్ అవసరంఉన్న ముందుండి ఇప్పియడం కరోనా టైం లో ఆక్సిజన్ అందరికి అందచేసి కూడా సేవలు అందించారని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ సమాజ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నూతన బాధ్యతలు స్వీకరించిన అరుణ్ తేజ చారికి పలువురు విశ్వకర్మ సంఘం నాయకులు, సభ్యులు అభినందనలు తెలిపారు.

# 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



**వేములవాడ, ఆగస్ట్ 19: నేటి మన దేశమ్ ప్రతినిధి** అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వేములవాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. వట్టెంల గ్రామంలో గుడిసెలో నిల్వ చేసిన 20 క్వింటాళ్లతో పాటు రెండు ఆటోల్లో తరలిస్తున్న మరో 10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించేందుకు నల్గొండ వైపు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో వానరసి శ్రీనివాస్, మోతె భానుప్రసాద్, గుంట ఎల్లయ్యలను అదుపులోకి తీసుకుని రెండు ఆటోలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు రూరల్ ఎస్ఐ వెంకట్రాజం తెలిపారు. బియ్యాన్ని పట్టుకున్న ఎస్ఐ వెంకట్రాజం, కానిస్టేబుల్ దేవరాజు, సిబ్బందిని రూరల్ సీఐ శ్రీనివాస్ అభినందించారు.

# తొలిసారిగా రోబోటిక్ 'బోరి ఫ్లాప్' శస్త్రచికిత్స

## – మహిళకు మూత్రపిండాల పనితీరు పునరుద్ధరణ

### విశాఖపట్నంలోని ఏఐఎన్‌యు (AINU) హాస్పిటల్ సెంటర్ ఫర్ రోబోటిక్ సర్జరీ



**విశాఖపట్నం ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** ఉత్తరాంధ్ర యురాలజికల్ వైద్యరంగంలో ఆసియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యురాలజీ (ఊ×చీఖ) వైజాగ్ సరికొత్త మైలురాయిని అధిగమించింది. కాకినాడకు చెందిన 50 ఏళ్ల మహిళకు అత్యంత సంక్లిష్టమైన 'లాంగ్-సెగ్మెంట్ యురేటరిక్ స్ట్రిక్చర్' (మూత్రనాళం పొడవునా ఏర్పడిన అవరోధం) సమస్యను నయం చేయడానికి, విశాఖపట్నంలోనే తొలిసారిగా రోబోటిక్ 'బోరి ఫ్లాప్' రీకన్స్ట్రక్షన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, ఆమె కిడ్నీ పనితీరును పునరుద్ధరించారు. బాధితురాలు ప్రారంభంలో మూత్రనాళంలో రాయి సమస్యతో బాధపడుతూ వేరే ఆసుపత్రిని సంప్రదించారు. అయితే మూత్రనాళం ఇరుకుగా ఉండడం వల్ల రాయిని తొలగించడం సాధ్యపడలేదు. ఫలితంగా ఆమె మూత్రపిండాల ఇన్ఫెక్షన్, మూత్ర అవరోధానికి గురయ్యారు. ఆ పరిస్థితిలో ఆమె ఏఐఎన్‌యు వైజాగ్ ఆసుపత్రిలో చేరగా, వైద్య బృందం వెంటనే పర్క్యుటేనియస్ నెఫ్రోస్టోమీ (ూజచీ) ట్యూబ్ ద్వారా ఇన్ఫెక్షన్‌ను నియంత్రించి, ఆ తర్వాత మూత్రనాళంలోని రాయిని తొలగించింది. అయినప్పటికీ, మూత్రనాళం చాలా భాగం దెబ్బతినడం వల్ల ఆమెకు పదేపదే ఇన్ఫెక్షన్లు వస్తుండేవి. దీంతో వైద్యులు రోబోటిక్ రీకన్‌స్ట్రక్టివ్ పద్ధతి ద్వారా ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని నిర్ణయించారు. శస్త్రచికిత్స సమయంలో యురేటర్ (మూత్రనాళం) భాగం ఊహించిన దానికంటే ఎక్కువ విస్తీర్ణంలో దెబ్బతిన్నట్లు గుర్తించారు. దాంతో సాధారణ శస్త్రచికిత్సలు ఉపయోగపడవని గ్రహించిన శస్త్రచికిత్స నిపుణులు, 'రోబోటిక్ బోరి ఫ్లాప్ రీకన్స్ట్రక్షన్' పద్ధతిని ఎంచుకున్నారు. ఇందులో మూత్రాశయం నుంచి ఒక చిన్న కణజాలాన్ని తీసుకుని, దెబ్బతిన్న మూత్రనాళాన్ని పునర్నిర్మించారు. సాంప్రదాయ ఓపెన్ సర్జరీ తో పోలిస్తే, రోబోటిక్ సాంకేతికత ద్వారా చిన్న కీహోల్ ద్వారా మాత్రమే ఈ ఆపరేషన్ పూర్తి చేశారు. దీనివల్ల రక్తస్రావం లేకపోవడం, నొప్పి లేకపోవడం మరియు రోగి వేగంగా కోలుకోవడం సాధ్యమైంది. శస్త్రచికిత్స పూర్తయిన మూడో రోజే రోగి కోలుకోవడంతో, కిడ్నీ ట్యూబ్‌ను తొలగించి ఆమెను డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ అమిత్ సాప్లే మాట్లాడుతూ: "ఈ కేస్ చాలా సంక్లిష్టమైనది. మూత్రనాళం ఇరుకుగా ఉన్న భాగం కీలకమైన రక్తనాళాలకు అత్యంత సమీపంలో ఉండటంతో ఆపరేషన్ సవాలుగా మారింది. రోబోటిక్ పరిజ్ఞానం వల్ల అత్యంత ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స పూర్తి చేయగలిగాం" అని తెలిపారు. ఏఐఎన్‌యు వైజాగ్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీనియర్ యురాలజిస్ట్ డాక్టర్ జి. రవీంద్ర వర్మ మాట్లాడుతూ: "దీర్ఘకాలిక యురేటరిక్ స్ట్రిక్చర్స్ కిడ్నీ పనితీరును దెబ్బతీస్తాయి. రోబోటిక్ బోరి ఫ్లాప్ విధానం ద్వారా మూత్రాశయ కణజాలాన్ని ఉపయోగించి మూత్ర ప్రవాహాన్ని సాధారణ స్థితికి తెచ్చాము. బాధితురాలి కిడ్నీని కాపాడటంలో రోబోటిక్ సాంకేతికత విప్లవాత్మక మార్పులు తెస్తోంది" అని పేర్కొన్నారు. ఈ రోబోటిక్ శస్త్రచికిత్సను డాక్టర్ అమిత్ సాప్లే, డాక్టర్ జి. రవీంద్ర వర్మ, మరియు డాక్టర్ పి. శ్రీధర్ లతో కూడిన నిపుణుల బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఏఐఎన్‌యు వైజాగ్ ఆసుపత్రిలో ఈ తరహా సంక్లిష్ట రోబోటిక్ శస్త్రచికిత్సలతో పాటు రాడికల్ ప్రోస్టేటెక్టోమీ, రాడికల్ సిస్టెక్టోమీ వంటి అనేక అధునాతన ఆపరేషన్లు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

# కౌన్సిల్‌లో బొత్స సత్యనారాయణను 'దద్దమ్మ' అని సంబోధించడం సరికాదు

## అచ్చెంనాయుడు బేషరతుగా క్షమాపణ చెప్పాలి: వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ




**విశాఖపట్నం ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఉద్దేశించి మంత్రి అచ్చెన్నాయుడు 'దద్దమ్మ' అంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధికార ప్రతినిధి లిఆల్ఫా కృష్ణలి అన్నారు. ప్రజా ప్రతినిధులు సభల్లో హుందాగా, బాధ్యతా యుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, బొత్స సత్యనారాయణకు అచ్చెన్నాయుడు లిబేషరతుగా క్షమాపణ చెప్పాలనిలి డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆల్ఫా కృష్ణ మాట్లాడారు. అధికారంలో ఉన్నామనే అహం కారంతో నోటికి వచ్చినట్లు మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.

**'దద్దమ్మ నాయుడు' అంటే ఊరుకుంటారా? :** 'దద్దమ్మ' అనే పదాన్ని ఉపయోగిస్తూ అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై ఆల్ఫా కృష్ణ తీవ్రంగా స్పందించారు. అదే పదంతో అచ్చెన్నాయుడిని ఎవరైనా సంబోధిస్తే ఆయన అంగీకరిస్తారా? అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు వ్యక్తిగత దూషణలకు దిగితే అది సభల గౌరవాన్ని దిగజార్చడమే అవుతుందని అన్నారు.

అచ్చెన్నాయుడు సోదరుడు, దివంగత ఎర్రన్నాయుడు వంటి సీనియర్ నాయకులు పాటించిన రాజకీయ విలువలను ప్రస్తుత నాయకులు గుర్తు చేసుకోవాలని సూచించారు. సభల్లో వ్యక్తిగత విమర్శలకు బదులుగా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చ జరగాలని అన్నారు.

**డీఎస్సీ అంశంపై ప్రభుత్వ ద్వంద్వ వైఖరి :** డీఎస్సీ అంశంపై అసెంబ్లీలో ఒక రోజు చర్చ జరిపి, మెజారిటీ ఉందనే కారణంతో తీర్మానం చేసిన అధికార పక్షం.. మరుసటి రోజు కౌన్సిల్‌లో అదే అంశంపై చర్చ అవసరం లేదని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆల్ఫా కృష్ణ విమర్శించారు.

డీఎస్సీ వ్యవహారంపై ఆరోపణలు నిజం కాదని ప్రభుత్వం భావిస్తే స్వతంత్ర దర్యాప్తుకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. ఈ అంశంపై సీబీఐ విచారణకు ఎందుకు అంగీకరించడం లేదో ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

**'విచారణకు భయమెందుకు?' :** అవినీతి, అక్రమాలు జరగలేదని ప్రభుత్వం చెబుతున్నప్పుడు స్వతంత్ర దర్యాప్తును ఎదుర్కోవడంలో భయమెందుకని ఆల్ఫా కృష్ణ నిలదీశారు. డీఎస్సీపై నిరుద్యోగ యువత ఆందోళన చేస్తున్న సమయంలో వైసీపీ కార్యక్రమాలు చేపడితే పట్టించుకోకుండా, అనంతరం పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని విమర్శించారు. డీఎస్సీ అంశంపై నిరుద్యోగ యువతకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**వైఎస్సార్ పాలనలో జవాబుదారీతనాన్ని గుర్తు చేసిన ఆల్ఫా కృష్ణ :** గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలపైనా విచారణకు సిద్ధమని ప్రకటించిన సందర్భాలను ఆల్ఫా కృష్ణ గుర్తు చేశారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులకు విశ్వాసం, నైతికత, జవాబుదారీతనం ఎంతో ముఖ్యమని అన్నారు. అదేవిధంగా గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న మంత్రులపై ప్రభుత్వాలు చర్యలు తీసుకున్న సందర్భాలను ప్రస్తావిస్తూ.. తప్పు జరిగితే చర్యలు తీసుకునే ధైర్యం ప్రభుత్వానికి ఉండాలని అన్నారు.

**'బొత్స సత్యనారాయణకు క్షమాపణ చెప్పాలి' :** కౌన్సిల్‌లో బొత్స సత్యనారాయణను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆయనను మాత్రమే కాకుండా ఆయనను గౌరవించే ప్రజలను కూడా అవమానించేలా ఉన్నాయని ఆల్ఫా కృష్ణ అన్నారు. బొత్స సత్యనారాయణ వంటి సీనియర్ నాయకుడిని సభలో అవమానించేలా మాట్లాడటం సరికాదని, అచ్చెన్నాయుడు వెంటనే లిబేషరతుగా క్షమాపణ చెప్పాలనిలి డిమాండ్ చేశారు.

**'మాటల పులులు కాదు.. చేతల పులులు కావాలి' :** ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, అభివృద్ధి, డీఎస్సీ వ్యవహారం, ప్రస్తుత పాలనతో పాటు గత రాజకీయ పరిణామాలపై చర్చకు వైసీపీ సిద్ధంగా ఉందని ఆల్ఫా కృష్ణ అన్నారు. అధికారంలో ఉన్నామనే ధీమాతో ప్రతిపక్ష నాయకులను తక్కువ చేసి మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చేతల్లో తన సామర్థ్యాన్ని చూపించాలని అన్నారు. టీడీపీకి ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేదని విమర్శించిన ఆల్ఫా కృష్ణ.. వైసీపీ మాత్రం గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల కోసం, సిద్ధాంతాల కోసం పోరాడే పార్టీ అని అన్నారు.

**'ఒక మాట అంటే వంద మాటలతో సమాధానం' :** ఇప్పటివరకు వైసీపీ ఓపికగా వ్యవహరించిందని, ఇకపై అధికార పార్టీ నాయకులు చేసే ప్రతి అనుచిత వ్యాఖ్యకు రాజకీయంగా గట్టిగా సమాధానం ఇస్తామని ఆల్ఫా కృష్ణ హెచ్చరించారు. అరెస్టులు, కేసులు, జైళ్లతో వైసీపీ గొంతును అణచలేరని అన్నారు. అధికార పార్టీ నేతలు ప్రజల్లో బాధ్యతాయుతంగా మెలగాలని, వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

**'క్షమాపణ చెప్పకపోతే పోరాటం ఉధృతం' :** బొత్స సత్యనారాయణకు అచ్చెన్నాయుడు బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే వైసీపీ అధినేత లివైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలి నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆల్ఫా కృష్ణ హెచ్చరించారు.

"అచ్చెన్నాయుడు. నోరు జాగ్రత్త. అధికారంలో ఉన్నారు కదా అని నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. ప్రజా జీవితంలో హుందాగా, బాధ్యతగా వ్యవహరించాలి. బొత్స సత్యనారాయణకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని ఆల్ఫా కృష్ణ డిమాండ్ చేశారు.

# శతశాతం అక్షరాస్యతే లక్ష్యం

## – డిఆర్‌డిఏ పిడి శ్రీనివాస పాణి – ఉల్లాస్ జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం ప్రారంభం

**విజయనగరం, ఆగస్ట్ 19 (నేటి మనదేశమ్) :** జిల్లాలో శతశాతం అక్షరా స్యతను సాధించేందుకు కృషి చేద్దామని డిఆర్‌డిఏ పిడి శ్రీనివాస పాణి పిలుపునిచ్చారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అక్షరాంధ్ర జిల్లా స్థాయి శిక్షణ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పిడి శ్రీనివాస పాణి మాట్లాడుతూ, అక్షరాస్యత ప్రాధాన్యతను వివరించారు. సుమారు 145 కోట్లు పైబడిన మన దేశ జనాభాలో ఇప్పటికే 80 శాతం అక్షరాస్యతను సాధించడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. అయినప్పటికీ శతశాతం అక్షరాస్యతను సాధించే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. దీనికోసం ఉల్లాస్ కార్యక్రమాన్ని కేంద్రప్రభుత్వం అమలు చేస్తోందని, దీనిని నిరక్షరాస్యులు సద్వినియోగం చేసుకొని, అక్షరాస్యులుగా మారాలని పిలుపునిచ్చారు. అక్షరాలు చదవడం, రాయడంతోపాటుగా, సామాన్య పరిజ్ఞానం, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతపై కూడా ఈ 100 గంటల శిక్షణా కార్యక్రమంలో అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఇటువంటి అవగాహనా కార్యక్రమం సామాన్య ప్రజలకు కూడా అవసరమేనని పిడి అభిప్రాయపడ్డారు. ఈ మూడవ విడత అక్షరాంధ్ర కార్యక్రమంలో జిల్లాలోని సుమారు లక్షా, 26వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వయోజన విద్య ఉపసంచాలకులు ఏ. సోమేశ్వర రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో 2029 నాటికి 100 శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉల్లాస్ పథకానికి అనుబంధంగా 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. 15 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల నిరక్షరా స్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.




# అక్రమ కట్టడాలపై కొరడా!

- గత పాలకవర్గం అక్రమాల చిట్టా విప్పుతాం
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటివారైనా వదలం
- చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ, ఆగస్ట్ 19: నేటి మన దేశమ్ ప్రతినిధి** అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ పాలకవర్గం ఉక్కుపాదం మోపుతోంది. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్పష్టం చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమాల చిట్టా బయటపెడతాంగత పాలకవర్గం ఐదేళ్ల కాలంలో జరిగిన అక్రమ నిర్మాణాలు, మంజూరైన అనుమతులపై పూర్తి వివరాలను సేకరిస్తున్నామని పుల్కం రాజు తెలిపారు. ఆధారాలతో సహా త్వరలో ప్రజల ముందుంచుతామని చెప్పారు. ప్రస్తుత పాలకవర్గంపై కొందరు చేస్తున్న ఆరోపణలు వాస్తవాలను మరుగునపరిచే ప్రయత్నమేనన్నారు. జగిత్యాల బస్టాండ్ ప్రాంతంలో ఒకచోట అనుమతి తీసుకుని మరోచోట నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినట్లు ఫిర్యాదు రావడంతో అధికారులు స్పందించారని తెలిపారు. నోటీసులు జారీ చేయడంతో పాటు ఈ నెల 3న నిర్మాణ అనుమతిని రద్దు చేసినట్లు వివరించారు. ఈ చర్య తమ వల్లే జరిగిందంటూ కొందరు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. తమ పాలకవర్గం అక్రమ నిర్మాణాలకు అనుమతుల విషయంలో ఎలాంటి లోపాయికారీ వ్యవహారాలకు పాల్పడదని చైర్మన్ స్పష్టం చేశారు. 11వ వార్డులోని అక్రమ కట్టడాలపై మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రభుత్వ నిబంధనల మేరకే చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని పుల్కం రాజు తప్పుబట్టారు. వ్యక్తిగత సానుభూతి కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తమ నేతపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. వేములవాడలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ నాయకులే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని చైర్మన్ గుర్తుచేశారు. ఆ ఫిర్యాదుల ఆధారంగానే అధికారులు చట్టపరమైన చర్యలు చేపడుతున్నారని తెలిపారు. కూల్చివేతలు ప్రభుత్వ నిబంధనలు, చట్ట ప్రకారమే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు ప్రస్తుత పాలకవర్గంపై దుష్ప్రచారం చేస్తున్నారని పుల్కం రాజు ఆరోపించారు. వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని, అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శక పాలన అందిస్తామని తెలిపారు.



# గుడిలోవ లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ మూడు రోజుల బైఠక్



**భీమునిపట్నం ఆగస్టు 19 నేటి మనదేశమ్ :** ఆనందపురం మండలంగుడిలోవ 'విజ్ఞాన్ విహార్' పాఠశాలలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అఖిల భారత సమన్వయ సమావేశం బుధవారం ఉదయం ప్రారంభమైంది. భారత్ మాత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించడం ద్వారా సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ జీ, సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబలే జీ ఈ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశం ఆగస్టు 21వ తేదీ సాయంత్రం వరకు కొనసాగుతుంది. ఈ వార్షిక అఖిల భారత సమన్వయ సమావేశానికి పూజ్య డా. మోహన్ భగవత్ జీ, దత్తాత్రేయ హోసబలే జీ లతో పాటు సహ-సర్కార్య వాహకులందరూ ఇతర కేంద్ర కార్యవర్గ సభ్యులు హాజరవుతారు. ఈ సమన్వయ సమా వేశానికి ఆర్ఎస్ఎస్ ప్రేరణతో ప్రారంభమై పనిచేస్తున్న భారతీయ మజ్దూర్ సంఘ్, విశ్వ హిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీ, అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్, భారతీయ కిసాన్ సంఘ్, రాష్ట్ర సేవికాసమితి లతో పాటు సంఘ్ స్ఫూర్తితో పనిచేస్తున్న మొత్తం 32 విభిన్న సంస్థల నుండి జాతీయ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అఖిల భారత సంస్థాగత కార్యదర్శులు కొంతమంది ఎంపిక చేసిన కార్యకర్తలు హాజరయ్యారు. మొత్తం 49 మంది మహిళలతో కలిపి 327 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు.

# ఎర్ర మట్టి దిబ్బలు పరిరక్షణకై చర్యలు చేపట్టండి



**భీమునిపట్నం ఆగస్టు 19 నేటి మనదేశమ్ :** భీమిలి ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా ఉంటూ ఎంతోమంది పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించే ఎర్ర మట్టి దిబ్బల పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని టి డి పి రాష్ట్ర మాజీ కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు తెలిపారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఎర్రదిబ్బల పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రత్యేక దృష్టిపెట్టి చర్యలు చేపట్టాలని కోరారు. సుమారుగా 18,500 నుండి 20,000 సంవత్సరాల కాలం సమయంలో ఇవి ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారని, నాటి భూగోళ పరిణామ క్రమానికి, వాతావరణ మార్పులకు సజీవ సాక్ష్యాలుగా ఎర్రదిబ్బలు వెలిసాయని అన్నారు. దక్షిణ ఆసియాలోని ఉష్ణమండలం ప్రాంతా లైన భీమిలి, తమిళనాడులోని తేరి స్మశానదిబ్బలు, శ్రీలంకలో మాత్రమే ఇటువంటి ఎర్రదిబ్బలు ఉన్నాయనీ చెప్పారు. భీమిలి ఎర్రదిబ్బలను కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ( జి.ఎస్.ఐ ) జాతీయ భౌగోళిక వారసత్వ సంపదగా 2014 వ సంవత్సరంలో ఎర్రదిబ్బలను ప్రకటించిందని అన్నారు. భీమిలి సముద్ర తీర ప్రాంతానికే వన్నెతెచ్చిన ఎర్రదిబ్బలను, వేలాదిమంది పర్యాటకులను ఎంతో ఆహ్లాదానికి గురి చేస్తుందనీ తెలిపారు ఇప్పటికే ఇసుక దిబ్బలు తరిగిపోతున్నాయని, కొంత ప్రాంతం ఆక్రమణకు గురవుతుందని అన్నారు. దయచేసి భీమిలి ఔనత్యానికి నిదర్శనంగా, ఈ ప్రాంతానికి ఉండే పేరు ప్రఖ్యాతులకు తగ్గట్టుగా పరిరక్షణలో భాగంగా చర్యలు చేపట్టాలని గంటా నూకరాజు ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేసారు.

# 22న తొట్లకొండ పై అనుమతులు లేవు

**భీమునిపట్నం ఆగస్టు 19 నేటి మనదేశమ్ :**నగరంలో బ్రిక్స్ బృందం పర్యటనలో భాగంగా ఈ నెల 22న తొట్లకొండ పైకి సందర్శకులకు అనుమతులు ఇవ్వరని వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ తెలిపారు. బ్రిక్స్ బృందం నగర పర్యటనలో భాగంగా వీఎంఆర్‌డీఏకు చెందిన పర్యా టక ప్రాంతమైన తొట్లకొండను సందర్శించనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 22న (శనివారం) ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు తొట్లకొండపైకి సందర్శకులను, పర్యాటకులకు అనుమతి ఇవ్వరని స్పష్టం చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి తొట్లకొండపైకి యధావిధిగా అనుమతులు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని నగరవాసులు, సందర్శకులు దయతో గమనించాల్సిందిగా కోరారు.

# తిరుమలాపురం చెరువు తూము రంధ్రం దగ్గర రాళ్లను తొలగించాలి

## తూము ను సందర్శించిన తెలుగుదేశం పార్టీ నేతలు



**వనపర్తి ఆగస్టు 19 నేటిమనదేశమ్ ప్రతినిధి** వనపర్తి జిల్లా గోపాల్పేట్ మండలం జయన్న తిరుమలాపురం గ్రామంలో చెరువు తూము రంధ్రం దగ్గర కిందికి నీళ్లు రాకుండా కొందరు తూముకు అడ్డంగా రాళ్లు వేశారని తెలుగుదేశం పార్టీ నేతలకు మున్ననుర్ అప్పాయిపల్లి వనపర్తి రైతు లు వనపర్తి జిల్లా తెలుగుదేశం పార్టీ నేతలకు సమాచారం ఇచ్చారని తెలుగుదేశం పార్టీ నేతలు తెలిపారు తూములకు కొందరు అడ్డంగా రాళ్లు వేయడం వల్ల సాగు నీరు కిందికి రావడం లేదని వనపర్తి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాగితాల లక్ష్మయ్య డి బాలరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు తూము రంధ్రాలకు అడ్డంగా పెద్ద రాళ్లను మేడం వల్ల అబ్బాయిపల్లి వనపర్తి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు వెంటనే జిల్లా కలెక్టర్ వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి అధికారులతో చర్చించిన తూముకు అడ్డం గా వేసిన రాళ్లను తొలగించే విధంగా రైతుల ఇబ్బందులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత న్యాయవాది షాకీర్ షాకీర్ హుస్సేన్ ఫారూక్ రైతు నాయకులు టాక్టర్ బాలయ్య ఆవుల శ్రీనుతదితరులు పాల్గొన్నారని బాలరాజు విలేకరులకు తెలిపారు

# స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా యాదాద్రిలో గిరిప్రదక్షిణ-పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య





**యాదాద్రి భువనగిరి ఆగస్టు 19 (నేటి మనదేశమ్):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి స్వాతి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లిఆలేరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. వేకువజామున ఆలయ ముఖ మండపంలో అర్చకులు శతఘటాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య , ఆలయ ఈవో భవాని శంకర్ గారితో కలిసి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహించిన ఈ గిరిప్రదక్షిణలో వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. గోవింద నామస్మరణలు, భక్తుల ఆధ్యాత్మిక సందడితో యాదగిరిగుట్ట పరిసరాలు మార్మోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.

# సైకిల్‌పై సవారి.. పారిశుధ్యంపై గురి : మున్సిపల్ కమిషనర్



**సిద్ద్‌పేట ఆగస్టు 19 నేటి మనదేశమ్ ప్రతినిధి :** సిద్దిపేట పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఉదయం సైకిల్‌పై పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని 4, 5, 6 వార్డులతో పాటు ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో సైకిల్‌పై తిరుగుతూ పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో బహిరంగంగా చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించారు. పట్టణ పరిశుభ్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని కమిషనర్ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్‌ను ఆదేశించారు. అనంతరం సిద్దిపేట పట్టణం నుంచి వెలువడే తడి చెత్తను తరలించే బస్సాపూర్ డంప్‌యార్డ్‌కు కమిషనర్ సైకిల్‌పై వెళ్లి ఆకస్మికంగా తనిఖీ చేశారు. డంప్‌యార్డ్‌లో సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించడంతో పాటు ప్రతిరోజూ పట్టణం నుంచి తరలిస్తున్న తడి చెత్త పరిమాణం, నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డంప్‌యార్డ్‌లో క్షేత్రస్థాయిలో కలియ తిరుగుతూ పారిశుద్ధ్య నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే బయో-సీఎన్‌జీ గ్యాస్ తయారీ ప్లాంట్‌ను పరిశీలించి, ప్లాంట్ నిర్వహణ మరియు కార్యకలాపాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, చౌరస్తాలు, బహిరంగ ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు కమిషనర్ సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఎన్విరాంల్మెంట్ ఇంజనీర్ అన్వేష్ పాల్గొన్నారు.

# తిరుమల లో దర్శనం తర్వాత ఓకే ఎంట్రన్స్ లో భక్తులను వదలడం వల్ల ఇబ్బందులు



**వనపర్తి ఆగస్టు 19 నేటిమనదేశమ్ ప్రతినిధి** తిరుమల కొండపై శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం తర్వాత ఓకే ఎంట్రన్స్ లో భక్తులను వదలడం వల్ల చంటి పిల్లల తల్లులు వృద్ధులు వికలాంగులు కాళ్ల నొప్పులు ఉన్నవాళ్లు ఇబ్బందులకు గురవుతున్నారని భక్తులు తెలిపారు దర్శనం తర్వాత సింగల్ లైన్ బార్కెడ్లు ఏర్పాటు ఒకే లైన్ వచ్చే విధంగా ఏర్పాటుచేసి సింగల్ లైన్ ద్వారా భక్తులు బయటకు వెళ్ళుటకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టీటీడీ చైర్మన్ బోర్డ్ సభ్యులు టి టి డి అధికారులను భక్తులు రామయ్య రామ్మోహన్ నరసింహ నరేందర్ ఏర్పుల జ్ఞానేశ్వర్ యాదవ్ కోరారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్శనము తర్వాత ఒకే దారి గుండా భక్తులను వదలడం వల్ల భక్తులు కింద పడిపోయే అవకాశం ఉన్నదని వారు పేర్కొన్నారు వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి సింగల్ లైన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారుకోరారు

# గడిబురుజుల భూమికి వీఎల్‌టీ నంబర్ ?

**నిర్మాణాలేవీ లేకుండానే వీలునామాతో నంబర్ కేటాయించారంటూ ఆరోపణ**

**వీఎల్‌టీ నంబర్ 6-4-228 ను తక్షణమే రద్దు చేయాలని మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు**



**కోరుట్ల, ఆగస్టు 19(నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని గడిబురుజులకు సంబంధించిన భూమికి ఎలాంటి నిర్మాణాలు లేకుండానే వీఎల్‌టీ నంబర్ కేటాయించారని ఆరోపిస్తూ కోరుట్లకు చెందిన కటుకం చంద్రశేఖర్ మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. గడిబురుజులకు సంబంధించిన సుమారు 5,800 చదరపు గజాల భూమికి వీఎల్‌టీ నంబర్ 6-4-228 కేటాయించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నంబర్‌ను రద్దు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించిన ఫిర్యాదులో చంద్రశేఖర్ పలు అంశాలను ప్రస్తావించారు. ఎలాంటి షెడ్ లేదా ఇతర నిర్మాణాలు లేకుండానే కేవలం వీలునామా ఆధారంగా వీఎల్‌టీ నంబర్ కేటాయించారని ఆరోపించారు. వాస్తవానికి వీఎల్‌టీ నంబర్ కేటాయింపునకు సంబంధించి నిర్మాణాలు, ఆస్తికి సంబంధించిన చట్టబద్ధమైన పత్రాలు, సేల్ డీడ్, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

**నిర్మాణాల్లేకుండా ఎలా కేటాయించారు?**

గ్రామకంఠం భూమిగా పేర్కొంటున్న సదరు స్థలంలో ఎలాంటి షెడ్, కాంపౌండ్ తదితర నిర్మాణాలు లేకపోయినా వీఎల్‌టీ నంబర్ కేటాయించడంపై అనుమానాలు ఉన్నాయని చంద్రశేఖర్ తెలిపారు. వీలునామా ఆధారంగా మాత్రమే వీఎల్‌టీ నంబర్ కేటాయించడం మున్సిపల్ నిబంధనలకు విరుద్ధమని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు భూమిని భవిష్యత్తులో విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీఎల్‌టీ నంబర్ కేటాయింపు ద్వారా భూమిపై హక్కులు కల్పించుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

**ఉన్నతాధికారులకు ఫిర్యాదు ప్రతులు**

వీఎల్‌టీ నంబర్ 6-4-228 కేటాయింపు వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా కేటాయించి ఉంటే వెంటనే రద్దు చేయాలని చంద్రశేఖర్ కోరారు. ఈ ఫిర్యాదు ప్రతులను ఆర్‌డీఎంఏ, వరంగల్ మరియు సీడీఎంఏ, హైదరాబాద్ ఉన్నతాధికారులకు కూడా పంపినట్లు తెలిపారు. వీఎల్‌టీ నంబర్ కేటాయింపులో నిబంధనలు పాటించారా? సంబంధిత భూమికి చట్టబద్ధమైన హక్కు పత్రాలు ఉన్నాయా? ఎలాంటి నిర్మాణాలు లేకుండా నంబర్ కేటాయించడానికి కారణాలేమిటి ? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. వీఎల్‌టీ నంబర్ కేటాయింపు ప్రక్రియను పూర్తిగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే వెంటనే రద్దు చేయాలని చంద్రశేఖర్ మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు..

# ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పీఏసీ సమావేశానికి సీతక్క

**కామారెడ్డిలో ఘన స్వాగతం**

**శాలువాతో సత్కరించిన మున్సిపల్ చైర్పర్సన్ ఇప్పటి ఉమారాణి శ్రీనివాస్**



**కామారెడ్డ్, ఆగస్టు 19 (నేటి మనదేశమ్):** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పీఏసీ సమావేశానికి హాజరయ్యేందుకు కామారెడ్డికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. అనంతరం నిజామాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. సమావేశం అనంతరం నిర్వహించిన తేనీటి విందు కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై నాయకులు చర్చించినట్లు తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో ముందుకు సాగడం వంటి అంశాలపై నాయకులు దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ శెట్కార్, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్, నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ ఉమారాణి శ్రీనివాస్ తదితర సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు



**అదిలాబాద్ ఆగస్ట్ 19 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** పట్టణంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 21న శుక్రవారం రోజు శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మఠంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ రాజేశ్వర్ తెలిపారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. పదేండగా మహిళల కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమాజంలో ధార్మిక ఆత్మీయక వాతావరణం కనపర్చడం అభినందనీయమన్నారు. సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి మాట్లాడుతూ ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు పెద్ద ఎత్తున మాతృమూర్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు, ఈ వ్రతాలకు సంబంధించిన పూర్తి పూజా సామాగ్రి ఉచితముగా ఇవ్వబడునని ఈ పూజలో పాల్గొనే మాతృ మూర్తులు కేవలం కలశ చెంబు ఇంటి నుంచి తీసుకొని రాగలరని కోరారు, ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి, డిఆర్డిఎ పిడి రవీందర్ రాథోడ్, సమితి ప్రతినిధులు కందుల రవీందర్, మామిడి రాజు, సునీల్ అగర్వాల్, బాలు ఛాపర్వాల్, విజయ్, మహేష్ ప్రఫుల్ తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుకు గురి యిన వారికి వెంటనే వైద్య సేవలు అందించాలి



**వనపర్తి ఆగస్టు 19 నేటిమనదేశమ్ ప్రతినిది** జిల్లాలో పాముకాటు గురి అయిన వారికి వెంటనే వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి డాక్టర్ ల ను ఆదేశించారు కొత్తకోటలో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు డాక్టర్ ల తో సమీక్ష సమావేశం నిర్వహించారు కలెక్టర్ వెంట ఆర్ డి ఓ సుబ్రమణ్యం జిల్లా అధికారులు ఉన్నారు

# వృద్ధాశ్రమంలో ఘనంగా ప్రపంచ మానవత్వం దినోత్సవం.



**ఆసిఫాబాద్, ఆగస్టు19(నేటి మనదేశమే ప్రతినిధి)::** రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామంలో గల వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి స్పోర్ట్స్ అధ్యక్షులు దీకొండ సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో, వృద్ధులకు ప్రపంచ మానవత్వం దినోత్సవం సందర్భంగా వంట సామాగ్రిని బుధవారం అందజేశారు. సందర్భంగా అధ్యక్షులు సంజీవ్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవలు అందిస్తున్నామని రెబ్బెన మండలంలో గల ప్రజలు సేవలను సద్విని చేసుకోవాలని అన్నారు ఉచిత కంటి పరీక్షలు, రక్తం పరీక్షలు షుగర్ టెస్ట్ లు, పేదవారికి కంటి ఆపరేషన్లు ఇలాంటి ఎన్నో సేవలను లైన్స్ క్లబ్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా పర్యావరణాన్ని రక్షించడం కోసం మొక్కలు నాటడం, పేద విద్యార్థులకు బుక్కులు పుస్తకాల పంపిణీ, నోటుబుక్కులు పంపిణీ చేయడం తదితర కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ జోనల్ చైర్పర్సన్ అన్నం రమేష్, లయన్ కుసుమ విజయ, దీకొండ విజయ తో పాటు వృద్ధులు పాల్గొన్నారు..

# 38వ వార్డులో వన మహోత్సవం



**కామారెడ్డ్, ఆగస్ట్ 19.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** జిల్లా కేంద్రంలోని 38వ వార్డులో నిర్వహించిన వన మహోత్సవ మొక్కల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ద్వారా ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరచ వచ్చని ఛైర్పర్సన్ తెలిపారు. వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డి ఈ హన్మంతా రావు, ఏ ఈ వేణు ప్రసాద్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, అక్తర్, వార్డు ఆఫీసర్ స్నేహ లత, నాయకులు అమీర్, శ్రీకాంత్, వేణు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

# జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఏకగ్రీవం

**రెండోసారి అధ్యక్షుడిగా కమటాల శ్రీనివాస్ ఎన్నిక ఐకమత్యానికి నిదర్శనం.. వర్తకుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం హామీ**



**జగిత్యాల, ఆగస్టు 19 (నేటి మన దేశమ్ ప్రతినిధి):** జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ (వర్తక సంఘం) నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. సంఘం అధ్యక్షుడిగా కమటాల శ్రీనివాస్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. సంఘంలోని సభ్యుల మధ్య నెలకొన్న ఐకమత్యానికి ఈ ఏకగ్రీవ ఎన్నికలు నిదర్శనంగా నిలిచాయి. ఈ నెల 15న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో బుధవారం నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియ నిర్వహించారు. సంఘంలోని ఐదు పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా పూర్తయ్యాయి. నామినేషన్లను పరిశీలించిన అనంతరం అభ్యర్థుల ఎన్నికను ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించి, వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కమటాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది శ్రీనివాస్, కోశాధికారిగా కప్పల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా ఎలిమిల్ల చంద్రకాంత్, సహాయ కార్యదర్శిగా సామ సునీల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఎన్నికల కన్వీనర్ పల్లెల రాజయ్య, ఎన్నికల అధికారి పబ్బ శ్రీనివాస్, ఉప ఎన్నికల అధికారులు శ్రీనివాసమూర్తి, పాత సుధాకర్ తదితరులు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడం సభ్యుల ఐకమత్యానికి ప్రతీక అని అన్నారు. జగిత్యాల పట్టణంలోని ఇతర వర్తక, వ్యాపార సంఘాలకు కూడా ఈ ఏకగ్రీవ ఎన్నికలు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. సంఘ సభ్యుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, వర్తకుల సంక్షేమం, వ్యాపారాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనుబంధ సంఘాల ప్రతినిధులు, సభ్యుల అభిప్రాయాలు మరియు ఆలోచనలను పరిగణనలోకి తీసుకుని పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలోనే నూతన కార్యవర్గ పరిచయ వేదికను ఏర్పాటు చేసి, భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని నూతన కార్యవర్గ సభ్యులు వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా, ఏకగ్రీవంగా ముగియడంతో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మందిపై.. చైనా నిఘా





చైనా ప్రపంచవ్యాప్తంగా 140 కోట్లకు పైగా ప్రజలపై నిఘా పెట్టినట్లు అమెరికాకు చెందిన ఓ పత్రిక సంచలన కథనాన్ని వెలువరించింది. ఆ దేశ నిఘాలోని వారిలో సొంత పౌరులు సహా సందర్శనకు వచ్చిన విదేశీయులు కూడా ఉన్నట్లు తెలిపింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. చైనా తన సొంత ప్రజలపై ఎలా నిఘా పెడుతుందో తెలుసుకోవడానికి జనవరిలో మార్క్ హోఫర్ అనే సైబర్ సెక్యూ రిటీ పరిశోధకుడు ఇంటర్నెట్‌లో వెతుకు తుండగా 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే వెబ్‌సైట్‌లో తన పేరు, ఫొటో, పాస్‌పోర్ట్ సంఖ్య, గతంలో చైనా పర్యటన సమయంలో ఉపయోగించిన మొబైల్ నంబర్ సహా అన్ని వివరాలు కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ వెబ్‌సైట్‌లో ముఖ్యంగా చైనాలోని జాంగ్ జియాకోవు నగరానికి వెళ్లిన విదేశీయుల వివరాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వారిలో భారత్, తైవాన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, బ్రిటన్, అమెరికా, ఈజిప్ట్, ఇరాన్, ఇజ్రాయెల్, మొరాకో, పాకిస్థాన్, సూడాన్ ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. జాంగ్‌జియాకోవు హెబే నార్త్ యూనివర్సిటీలో చేరిన విదేశీ విద్యార్థుల సమాచారం కూడా ఇందులో ఉంది. అయితే వారిలో భారత్, పాక్‌కు చెందిన వారే అధికం కావడం గమనార్హం.

## అమెరికాలో టైమ్ సవరణ విధానానికి చెక్

### బిల్లును ఆమోదించిన ప్రతినిధుల సభ



వాషింగ్టన్ : ఏటా రెండుసార్లు గడియారాల్లో సమయాన్ని మార్చే విధానానికి స్వస్తి పలికేందుకు అమెరికా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 'డేలైట్ సేవింగ్ టైమ్'ను ఏడాది పొడవునా శాశ్వతం చేయడం కోసం ప్రవేశపెట్టిన 'సన్గ్÷న్ ప్రొటెక్షన్ యాక్ట్' బిల్లుకు అక్కడి ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. ప్రతినిధుల సభలో మంగళవారం జరిగిన ఓటింగ్‌లో 308-117 ఓట్ల భారీ మెజారిటీతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ప్రతినిధుల సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు అధ్యక్షుడు సంతకం చేస్తే అధికారిక చట్టంగా మారుతుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించారు. తాను అధికారంలోకి వస్తే ఈ గడియారాలు మార్చే విధానాన్ని ముగిస్తానని గతంలోనే ఆయన హామీ ఇచ్చారు. ఈ చట్టం వల్ల ప్రజలకు సాయంత్రం పూట ఎక్కువ సమయం లభి స్తుందని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ ఈ బిల్లుపై అతి త్వరలో సంతకం చేయనున్నారు. సూర్యుడు త్వరగా ఉదయించే వేసవి నెలల్లో.. ఉదయం 4 నుంచి 5 గంటలకే ఎండ వచ్చేస్తుంది. ఆ సమయంలో చాలామంది నిద్రపోతుంటారు. చాలా వరకు సమయం నిద్రలోనే వృధా అవుతుంది. గడియారాన్ని ఒక గంట ముందుకు జరపడం వల్ల.. సాయంత్రం పూట సహజమైన సూర్య కాంతిని ఎక్కువ సమయం ఉపయోగించు కోవడానికి అవకాశం ఉంటుంది. అమెరికా, కెనడా, బ్రిటన్, ఐరోపా దేశాలతో పాటు దాదాపు 70కి పైగా దేశాలు ఈ విధానాన్ని పాటిస్తున్నాయి. అమెరికన్లు వేసవి కాలంలో గడియారాలను ఒక గంట ముందుకు జరుపుతారు. దీన్నే 'స్ప్రింగ్ ఫార్వర్డ్' అంటారు. శీతాకాలంలో మళ్లీ ఒక గంట వెనక్కి జరుపుతారు. దీన్నే 'ఫాల్ బ్యాక్' అంటారు. ఇలా సమయాన్ని మార్చే విధానాన్ని పూర్తిగా ఆపేసి.. ఏడాది పొడవునా ఒకే టైమ్ ఉంచాలనే ఉద్దేశంతోనే అమెరికా ప్రభుత్వం కొత్త బిల్లును తీసుకువచ్చింది.

## అందరూ కలిసే చేయాలి..

### లేదంటే ఎవరూ చేయొద్దు.. చమురు వ్యాపారంపై ఇరాన్



పశ్చిమాసియాలో చమురు ఎగుమతులు చేస్తే అన్ని దేశాలు కలిసే చేయాలని.. లేదంటే ఎవరూ చేయకూడదని ఇరాన్ స్పష్టం చేసింది. బహ్రెయిన్ లోని యూఎస్ నేవీ స్థావరంపై ఐఆర్‌జీసీ దాడులు చేసిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. తమను కాదని ముందుకు వెళ్తే.. అమెరికా మిత్రదేశాల చమురు, గ్యాస్ ఎగుమతి మార్గాలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని.. పశ్చిమాసియా నుంచి చమురు, గ్యాస్ ఎగుమతుల మొత్తాన్ని ఆపుతామని హెచ్చరించింది. 'హర్మూజ్ జలసంధిపై నియంత్రణ సాధించామని చెబుతూ.. అమెరికా నిన్న రాత్రి హిందూ మహాసముద్రంలో సముద్రపు దొంగలను మోహరించింది. నౌకల రాకపోకలకు మార్గాలను మూసివేసి.. చమురు, గ్యాస్‌లను ప్రపంచానికి అందకుండా చేసింది. దీనివల్ల ఆ దేశ ఆర్థిక ప్రత్యర్థుల ప్రయోజనాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. వారి దుర్మార్గాలకు తగిన బుద్ధి చెప్పడానికి మా దళాలు బహ్రెయిన్‌లోని 5వ ఫ్లీట్ బేస్‌పై విజయవంతంగా దాడి చేశాయి. ఈ దాడుల్లో ఎన్ఎస్ఏ మేనేజ్‌మెంట్ సెంటర్, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు ధ్వంసమయ్యాయి. పశ్చిమాసియాలో వ్యాపారం చేస్తే అందరూ కలిసే చేయాలి. లేదంటే ఎవరూ చేయకూడదు' అని ఐఆర్‌జీసీ హెచ్చరించింది.

ఇరాన్‌కు సహకారాన్ని ఆపడానికి చైనా కృషి చేయట్లేదు: అమెరికా రాయబారి

ఇతర దేశాలపై దాడులు చేయడానికి ఇరాన్‌కు పలు చైనా (జష్ట్రఖఙ) కంపెనీలు సహకరిస్తున్నాయని ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి మైక్ వాల్ట్ ఆరోపించారు. ఈ విషయంలో చైనా ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదన్నారు. హూతీలపై ఆయుధాల నిషేధాన్ని విధించిన ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని కూడా పలు చైనా కంపెనీలు, ఇతర సంస్థలు ఉల్లంఘించాయని పేర్కొన్నారు.

**లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్..**

ఓ వైపు అమెరికా-ఇరాన్‌లు పరస్పర దాడులు చేసుకుంటుంటే.. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొన సాగిస్తోంది. ఈ దాడుల్లో గాజాలోని ఓ కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

## నకిలీ నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

హైదరాబాద్ : నకిలీ వాహన నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత వారం రోజుల వ్యవధిలో నకిలీ నంబర్ ప్లేట్లు ఉపయోగించిన వారిపై ఐదు క్రిమినల్ కేసులను పోలీసులు నమోదు చేశారు. జూబ్లీహిల్స్, మలక్‌పేట్, బేగంబజార్, అబిడ్స్, కాచిగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కేసులు నమోదయ్యాయి. ఈ ప్రత్యేక తనిఖీల్లో పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసుతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనాలపై తప్పనిసరిగా హెచ్ఎస్ఆర్‌పీఉండాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలను నిర్వహిస్తామని తెలిపారు.

## అబ్బే.. హర్మూజ్‌లో టోల్ లేదు

### డొనాల్డ్ ట్రంప్



దుబాయ్, వాషింగ్టన్: హర్మూజ్‌లో టోల్ వసూలు ప్రకటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక్క రోజులోనే వెనక్కి తగ్గారు. టోల్‌కు బదులు.. పశ్చిమాసియా దేశాలు తమతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటాయని, తమ దేశంలో భారీగా పెట్టుబడులు పెడతాయని మంగళవారం తెలిపారు. పశ్చిమాసియా నాయకత్వంతో చర్చల అనంతరం ఈ మేరకు హర్మూజ్‌లో రుసుముల విధింపు నిర్ణయాన్ని మార్చుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. హర్మూజ్‌లో నౌకలకు అమెరికా రక్షణ కల్పిస్తుందని, అందుకుగాను వాటిలోని సరకు విలువలో 20% టోల్ వసూలు చేస్తుందని ట్రంప్ సోమవారం సంచలన ప్రకటన చేసిన సంగతి తెలిసిందే.

కొనసాగిన దాడులు : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ పూర్తిస్థాయి యుద్ధరూపం దాల్చే ముప్పు కనిపిస్తోంది. ఇరాన్‌పై అమెరికా మంగళవారం కూడా వైమానిక దాడులతో విరుచుకుపడింది. ప్రధానంగా ఆ దేశంలోని తీర రక్షక వ్యవస్థలు, క్షిపణి/డ్రోన్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది. ప్రతిగా పశ్చిమాసియాలోని అగ్రరాజ్య మిత్రదేశాలైన బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లపై టెహ్రాన్ దాడులు చేసింది. ఇరాన్ నుంచి దూసుకొచ్చిన నాలుగు క్షిపణులను తాము అడ్డుకున్నట్లు జోర్డాన్ సైన్యం తెలిపింది.

## ఇమ్రాన్ ఖాన్‌ను కలిసిన భార్య, సోదరి



జైలులో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ను ఆయన సతీమణి, సోదరి కలిశారు. తన కుటుంబంతో వారానికి ఒకసారి సమావేశమయ్యేందుకు వీలు కల్పించాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో దాదాపు 9 నెలల తర్వాత ఆడియాలా జైలులో ఉన్న ఇమ్రాన్ తన సతీమణి బుష్రా బీబీ , సోదరి నొరీన్‌ను కలిసి మాట్లాడారు. మరోవైపు, ఆయన్ను ఆస్పత్రికి తరలించడానికి కావాల్సిన చట్టపరమైన చర్యలు కొసాగుతున్నాయి. తోషాఖానా, అల్-ఖాదిర్ ట్రస్ట్ తదితర కేసుల్లో శిక్ష పడటంతో ఇమ్రాన్ ఖాన్ కొన్నేళ్లుగా జైలు శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. ఒంటరితనం వల్ల ఆయన తీవ్రమైన ఒత్తిడి, మానసిక, శారీరక సంబంధమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని.. ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోందని కొన్ని నెలలుగా వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో ఇమ్రాన్‌ను చూడడానికి కుటుంబ సభ్యులను సైతం అనుమతించక పోవడంతో ఆయన పరిస్థితిపై ఆందోళన నెలకొంది.

## హసీనాను అప్పగించకపోతే భారత్‌కు వెళ్లను

### బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్



ఢాకా: మాజీ ప్రధాని షేక్ హసీనాను భారత్ నుంచి విడుదల చేసి తమకు అప్పగించకపోతే భారత్‌లో పర్యటించబోనని బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ తెలిపారు. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న హసీనాను వీలైనంత త్వరగా తమకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. 2024లో బంగ్లాదేశ్‌లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల అనంతరం షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందారు. అనంతరం బంగ్లాదేశ్ కోర్టు ఆమెకు మరణశిక్ష విధించింది. భారత్‌లో ఉంటూ హసీనా మీడియాతో చేస్తున్న వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య చర్చలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ పేర్కొంది. హసీనాను అప్పగించాలన్న బంగ్లాదేశ్ అభ్యర్థనను పరిశీలిస్తున్నామని భారత్ తన వైఖరిని వెల్లడించింది.

## తొలి సిక్కు ఫైటర్ పైలట్‌గా అర్ష్‌దీప్

లండన్: భారత సంతతికి చెందిన అర్ష్‌దీప్ సింగ్ చరిత్ర సృష్టించారు. బ్రిటన్ రాయల్ ఎయిర్ ఫోర్స్ (ఆర్ఎఎఫ్)లో తొలి భారతీయ సిక్కు ఫైట్ ఫైటర్‌గా ఎన్నికయ్యారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్‌లోని ఫైటర్ స్క్వాడ్రన్‌కు సిక్కు పైలట్‌ను నియమించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు



అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు వేసింది. 'జూక్-3' (ఘ్రబనబవ-3) రాకెట్‌ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి పంపి.. తొలి దశ విడిపోయిన అనంతరం తిరిగి భూఉపరితలంపై స్వాధీనం చేసుకుంది. బుధవారం డోంగ్‌ఫెంగ్ వాణిజ్య అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఈ ప్రయోగం చేపట్టింది. దాదాపు 66.1 మీటర్ల పొడవైన ఈ రాకెట్ మొదటి దశ తొమ్మిది ఇంజిన్లు కలిగి ఉంది. ప్రయోగం అనంతరం తొలి దశ విడిపోయి గాన్సు ప్రావిన్స్‌లోని మిన్‌చిన్ కౌంటీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. రాకెట్ తొలి దశను చైనా తిరిగి స్వాధీనం చేసుకోవడం ఇది రెండోసారి అయినప్పటికీ.. భూమిపై విజయవంతంగా ల్యాండ్ చేయడం ఇదే తొలిసారి. ఈ ఏడాది జులై 10న 'లాంగ్ మార్చ్-10బీ' రాకెట్ తొలి దశ సముద్రంలో ల్యాండ్ అయింది. తాజా ప్రయోగంలో భూ ఉపరితలంపైనే స్వాధీనం చేసుకున్నారు. అమెరికాకు చెందిన స్పేస్‌ఎక్స్, బ్లూ ఆరిజిన్ సంస్థలు 2015 నుంచే రాకెట్ తొలి దశలను తిరిగి ల్యాండ్ చేసి పునర్వి నియోగిస్తున్నాయి. రాకెట్ పునర్వినియోగం వల్ల ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది.

## బంగారు గని కూలి.. 30 మంది గని కార్మికులు మృతి

సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్: పశ్చిమ ప్రాంతంలోని ఓ బంగారు గని కూలిపోవడంతో సుమారు 30 మంది గని కార్మికులు మృతి చెందారు. మరికొందరు గనిలో చిక్కుకుపోయినట్లు అధికారులు, స్థానికులు తెలిపారు. నానా-మాంబెరే ప్రిఫెక్చర్‌లోని అబ్బా ప్రాంతంలో మంగళవారం ఉదయం ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. పాత పద్ధతులు, చేతి పనిముట్లతో నిర్వహిస్తున్న గని ఒక్కసారిగా కూలిపోవడంతో కార్మికులు మట్టిలో చిక్కుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదం నుంచి బయటపడిన గని కార్మికుడు ఫ్లోరియన్ గగుండే మాట్లాడుతూ.. గనిలో చిక్కుకున్న మరికొందరి కోసం సహాయక బృందాలు గాలిస్తున్నాయని చెప్పారు. అయితే, సమయం గడుస్తున్న కొద్దీ వారిని సజీవంగా వెలికితీసే అవకాశాలు తగ్గుతున్నాయని తెలిపారు. సహాయక బృందాలు, స్థానికులు గంటల తరబడి శ్రమించి శిథిలాల నుంచి 30 మృతదేహాలను వెలికితీశారు.

## సుప్రీంకోర్టులో అనుచిత ప్రవర్తన..

### న్యాయశాస్త్ర విద్యార్థుల అరెస్టు



సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కోర్టు కార్యకలాపాలకు అంతరాయం కలిగించిన ఇద్దరు న్యాయ విద్యార్థులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ప్రభల్ ప్రతాప్ సింగ్, చందర్ భాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. జులై 10న కోర్టులో ప్రభల్ ప్రతాప్ ప్రధాన న్యాయ మూర్తిపై దుర్భాషలాడటమే కాకుండా కాగితాలు విసిరి గందరగోళం సృష్టించిన విష యం తెలిసిందే. అడ్డుకునేందుకు ప్రయత్నిం చిన భద్రతా సిబ్బందిని తోసి విధులకు ఆటంకం కలిగించాడు. అతడితో పాటు ఉన్న రెండో నిందితుడు చందర్ భాన్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ విద్యార్థులిద్దరూ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారు. అయితే.. ఈ ఘటనపై కోర్టు ధిక్కార చర్యలు చేపట్టబోమని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. "అతడు తీవ్ర మానసిక ఆవేదనలో ఉన్నాడు. నిరాశతో అలా ప్రవర్తించాడు. అతడిపై మాకు సాను భూతి మాత్రమే ఉంది" అని వ్యాఖ్యానించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ దీనిపై మాట్లాడుతూ.. "ఈ ఘటనను పెద్దది చేయొద్దు. యువత కొన్ని సందర్భాల్లో ఇలా ప్రవర్తిస్తారు. రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడడం అందరి బాధ్యత" అని పేర్కొన్నారు.

## పాకిస్థాన్ అకృత్యాలకు వ్యతిరేకంగా..

### పీవోకేలో లాంగ్ మార్చ్



పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్రిక్తతలు కొన సాగుతున్నాయి. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చడానికి విధించిన గడువు ముగియడంతో.. 'ది జమ్ముకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ' ఉద్యమాన్ని మరింత తీవ్రం చేసింది. రావల్‌కోట్ నుంచి ముజఫరా బాద్ వరకు వేలాది మంది నిరసనకారులు లాంగ్ మార్చ్ చేపట్టారు. పీవోకేలో పాక్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని.. ఆ నేతల అకృత్యాలకు వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటంలో పాల్గొనాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. పీవోకేలో ద్రవ్యోల్బణాన్ని తట్టు కునేందుకు వీలుగా నిత్యావసర వస్తువు లపై రాయితీలు, విద్యుత్ ఛార్జీల తగ్గింపు, జలవిద్యుత్ ప్రాజెక్టులకు గుర్తింపు...

తదితర 38 డిమాండ్లు నెరవేర్చాలని జేఏఏసీ కోరుతోంది.

## ఇరాన్‌పై 7 గంటలు ఏకధాటిగా దాడులు: అమెరికా

అమెరికా-ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతూనే ఉంది. తాజాగా ఏడు గంటల పాటు ఇరాన్‌పై ఏకధాటిగా దాడులు చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్‌వెల్లడించింది. మంగళవారం రాత్రి ఈ దాడులు ప్రారంభమయ్యాయని, హర్మూజ్ జలసంధి, ఇరాన్ తీరప్రాంతాల సమీపంలోని సైనిక లక్ష్యాలను ఢీకొట్టామని పేర్కొంది. ప్రస్తుతానికి తాజా విడత దాడులు ముగిశాయని తెలిపింది."హర్మూజ్‌లో వాణిజ్య నౌకల లక్ష్యంగా ఇరాన్ చేస్తోన్న దాడుల సామర్థ్యాన్ని మరింత దెబ్బతీసేందుకు అమెరికా యుద్ధ విమానాలు, డ్రోన్లు, నౌకల నుంచి ఆయుధాలను ప్రయోగించాం. ఏడు గంటలపాటు జరిగిన ఈ దాడుల్లో ఇరాన్ క్షిపణి, డ్రోన్ నిల్వలు, నౌకా సామర్థ్యాలు, తీర ప్రాంత రక్షణ వ్యవస్థలను టార్గెట్ చేశాం" అని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఇరాన్ ఓడరేవులకు రాకపోకలు సాగించే నౌకలపై అమెరికా దళాలు దిగ్బంధనాన్ని పునః ప్రారంభించిన రోజే ఈ దాడులు జరిగాయి.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన

**సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి**
**విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఆటబొమ్మల పంపిణీ**
**మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్**



**కోరుట్ల, ఆగస్టు 19(నేటి మన దేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ అన్నారు. బుధవారం కోరుట్ల పట్టణంలోని కల్లూర్ రోడ్డులో గల గడి ప్రీ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, ఆటబొమ్మలను ఆమె పంపిణీ చేశారు. కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేష్, గడి ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నునావత్ రాజు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌లతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఆటబొమ్మలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి పలు సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. అదేవిధంగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ** కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన, కథలాపూర్ మండలం సిరికొండ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గంగాధర్ తల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ బుధవారం మాదాపూర్ గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గంగాధర్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతురాలి మృతికి సంతాపం తెలిపారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. చైర్ పర్సన్ వెంట స్థానిక నాయకులు చేపూరి కృష్ణారెడ్డి, పడాల లచ్చన్న, తోడేటి శంకర్, జమున, నాయిని ప్రసాద్, ఎడ్ల గణేష్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# సాంకేతికతతో పోయిన ఫోన్లకు రికవరీ.. జగిత్యాల పోలీసుల ఘన విజయం

**రూ.21 లక్షల విలువైన 102 మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత**
**సీఈఐఆర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**
**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన**







**జగిత్యాల, ఆగస్టు 19(నేటి మనదేశమ్ ప్రతినిధి):** మొబైల్ ఫోన్ పోయినా.. చోరీకి గురైనా బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన (సీఈఐఆర్) సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటి రిజిస్టర్ సేవలను సద్వినియోగం చేసుకుంటే ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఉంటుందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా పోలీసుల సాంకేతిక నైపుణ్యంతో పోగొట్టుకున్న, చోరీకి గురైన 102 మొబైల్ ఫోన్లను, సుమారు రూ.21 లక్షల విలువైన ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వాటిని సంబంధిత బాధితులకు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సంబంధిత వివరాలను ఝఝఝ.ఎవఅతీ.గ్రశీఙ.అఅ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేస్తే, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ప్రత్యేక బృందంతో నిరంతర నిఘా** పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్ల రికవరీ కోసం ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ బృందం సాంకేతిక ఆధారాలను ఉపయోగిస్తూ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకుంటోందన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభమైన నాటి నుంచి జగిత్యాల జిల్లా పరిధిలో ఇప్పటివరకు 2,024 మొబైల్ ఫోన్లను, సుమారు రూ.4.5 కోట్ల విలువైన ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్పీ వెల్లడించారు. మొబైల్ ఫోన్ పోయిన తర్వాత నిర్లక్ష్యం చేస్తే అందులోని వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఫోన్‌లోని వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, బ్యాంకింగ్ సమాచారం తదితరాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**సెకండ్ హ్యాండ్ ఫోన్ కొనుగోలులో జాగ్రత్త**

చోరీకి గురైన మొబైల్ ఫోన్లను కొందరు నేరాలకు ఉపయోగించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్ కొనుగోలు చేసే ముందు దాని ఐఎంఈఐ నంబర్‌ను సీఈఐఆర్ పోర్టల్‌లో పరిశీలించాలని తెలిపారు. తద్వారా ఆ ఫోన్ పరిస్థితి, స్టేటస్ గురించి తెలుసుకోవచ్చన్నారు. ఎవరైనా రోడ్డుపై లేదా ఇతర ప్రాంతాల్లో మొబైల్ ఫోన్ దొరికితే దానిని తమ వద్ద ఉంచుకోకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని, లేదా ఫోన్‌లోని సంబంధిత నంబర్‌కు సమాచారం అందించి యజమానికి తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం**

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సైబర్ నేరగాళ్లు కూడా తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. వివిధ రకాల ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకుల ద్వారా ప్రజలను మోసగించి డబ్బులు దండుకుంటున్నారని పేర్కొన్నారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా అంతర్జాతీయ కాల్స్, కొత్త నంబర్ల నుంచి వచ్చే అనుమానాస్పద కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. అజ్ఞాత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు తదితరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు.

**బాధితుల్లో ఆనందం**

ఈ సందర్భంగా మొబైల్ ఫోన్లు తిరిగి పొందిన పలువురు బాధితులు తమ ఫోన్లు ఏ విధంగా పోయాయో, అనంతరం పోలీసులను ఎలా సంప్రదించారో వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తమ విలువైన మొబైల్ ఫోన్లను గుర్తించి తిరిగి అందజేసిన జగిత్యాల జిల్లా పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పోయిన ఫోన్ తిరిగి దొరుకుతుందని ఊహించలేదని, పోలీసుల చర్యతో ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

**సీఈఐఆర్ బృందానికి ఎస్పీ అభినందన**

మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఈఐఆర్ బృందం సభ్యులను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి బాధితులకు న్యాయం చేయడంలో కృషి చేసిన సిబ్బందికి రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్ఐ కృష్ణ, సీఈఐఆర్ టీం హెడ్ కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుళ్లు మల్లేశం, అజర్, అనూష, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరి సహకారం అవసరం

**మిషన్ వాత్సల్య అధికారి సాదినేని రమేష్**



**కరీంనగర్, ఆగస్టు 19: నేటి మన దేశమ్ ప్రతినిధి** మానకొండూరు బాలుర ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై "నషా ముక్త్ భారత్ అభియాన్" ప్రోగ్రాంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ తరఫున 'నషా ముక్త్ భారత్ అభియాన్' ద్వారా మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రజలు సమష్టిగా కృషి చేయాలని మిషన్ వాత్సల్య అధికారి సాదినేని రమేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ రమేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



**వేములవాడ, ఆగస్టు 19 నేటి మన దేశమ్ ప్రతినిధి** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని గురు వారం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు బచ్చు వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమ్ము నటరాజ్, కోశాధికారి డాక్టర్ విజయ్ లు తెలిపారు. మహాలక్ష్మి డెంటల్ కేర్ సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులచే కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు, దృష్టి పరీక్షలు, కళ్లజోడు అవసరాన్ని గుర్తించడం, ఉచిత మందుల పంపిణీతో పాటు కంటి సంబంధిత సమస్యలపై వైద్యుల సూచనలు అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బచ్చు వంశీకృష్ణ కోరారు. కంటి ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, భవిష్యత్తులోనూ మరిన్ని ఉచిత వైద్య సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే ప్రజలు తమ కంటి సమస్యలను వైద్యులకు వివరించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యకరమైన కంటి చూపు కోసం వైద్యుల సూచనలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు పెద్ద సంఖ్యలో వినియోగించుకోవాలని అధ్యక్షులు బచ్చు వంశీకృష్ణ పిలుపునిచ్చారు.

# గడి బురుజుల స్థలాల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలి



**కోరుట్ల, ఆగస్టు 19(నేటి మన దేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని చారిత్రక కట్టడాలైన గడి బురుజుల స్థలాలు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని, అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ కోరుట్ల పట్టణ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి, అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ఫొటోలను సమర్పించారు. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి గడి బురుజుల స్థలాల పరిరక్షణపై చర్చించారు. లేటర్ నెంబర్ నా3/974/2013, తేదీ 14-07-2025 ప్రకారం చారిత్రక గడి బురుజుల స్థలాల చుట్టూ 15 అడుగుల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు ఉండకూడదని స్పష్టంగా ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా పలు నిర్మాణాలు చేపట్టారని నాయకులు ఆరోపించారు. గడి బురుజులు ఆనుకుని, కోనేరు ప్రాంతంలోనూ అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని బీజేపీ నాయకులు తెలిపారు. సంబంధిత అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ఫొటోలను అధికారులకు అందజేసి, వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. చారిత్రక కట్టడాల పరిరక్షణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, ప్రభుత్వ రికార్డుల ప్రకారం స్థలాలను రక్షించాలని డిమాండ్ చేశారు. మైసమ్మ గుడికి సంబంధించిన తాత్కాలిక షెడ్‌ను ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే తొలగించారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. అయితే గడి బురుజులను ఆనుకుని, కోనేరు ప్రాంతంలో నిర్మించిన అక్రమ కట్టడాలపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించేలా అధికారులు వ్యవహరించాలని కోరారు. చారిత్రక వారసత్వ సంపదను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గడి బురుజుల స్థలాల పరిరక్షణకు, అక్రమ నిర్మాణాల తొలగింపునకు త్వరితగతిన చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు, 11వ వార్డు కౌన్సిలర్ కస్తూరి లక్ష్మీనారాయణ, ఎండోమెంట్ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ మాడవేణి నరేష్, కౌన్సిలర్లు ఇందూరి తిరుమలవాసు, గుగ్గిలపు శ్రీకాంత్, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాకల గణేష్, మాజీ కౌన్సిలర్ పెండెం గణేష్, ఉపాధ్యక్షులు నెమూరి విజయ్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు బెక్కం అశోక్, నాయకులు సోరుపాక రమేష్, కాలాల సాయిచందు, పోతుగంటి శ్రీనివాస్, గుద్దేటి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

**డాక్టర్ చిన్నారెడ్డి దివంగత ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు**



**వనపర్తి ఆగస్టు 19 (నేటి మనదేశమ్):** దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ ఉన్నప్పుడు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ సి ఎం ప్రజావాణి ఇంచార్జి డాక్టర్ జి చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు అంటున్నారు చాలాకాలం నుండి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా వనపర్తి నుండి ఎమ్మెల్యే గా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు చిన్నారెడ్డిగారు గ్రామీణాభివృద్ధి మంత్రిగా, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కన్వీనర్ గా సేవలు అందించిన చిన్నారెడ్డి పై ఫిర్యాదు లు చేయడం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి కి మంచిది కాదని సీనియర్ నాయకులకు గౌరవం ఇవ్వడం నేర్చుకోవాలని, లేకపోతే ప్రజల నుండి తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు

# మందమర్రిలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**మందమర్రి ఆగస్టు 19 (నేటి మనదేశమ్):** మందమర్రి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఫోటో భవన్‌లో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పసుల వెంకటస్వామి తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు హాజరయ్యారు. ముందుగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగేర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్ ఊట్లకుల నాగేశ్వరరావు, తిలక్ ఫోటో స్టూడియో, బెల్లంపల్లి ని ఘనంగా సన్మానించి, ఆత్మీయ జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లకొండ కనకయ్య గౌడ్, జిల్లా మందమర్రి పట్టణ ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్ కుమార్, కోశాధికారి బద్రి సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వలస మనోహర్, ఉపాధ్యక్షులు నక్క పవన్, ఆర్. సుజిత్, తాళ్లపల్లి రమేష్, సహ కార్యదర్శి పసుల రవి, కార్యనిర్వాహక కార్యదర్శి జూపక సాది, కుటుంబ భరోసా ఇన్‌ఛార్జులు పట్టి సతీష్ బాబు, పగిడి రాజలింగు, మాజీ ఉపాధ్యక్షులు కామెర గణేష్, విక్రరీ అశోక్, కామెర మహేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సభ్యులు శంభోరు మనోజ్, ఐవూక్స్ ప్రసాద్, మామిడాల మధు, కేశవేణి హరికృష్ణ, కంచుకూరి ప్రసాద్, వంశీ (ఆర్.కె.పి), సిరిపురం మేడి స్వామి, వెంకటస్వామి, బండి వంశీ, కుడిపూడి రాము, చింతల మహేష్, ఇప్ప వెంకటేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఫోటోగ్రఫీ రంగానికి సేవలందిస్తున్న ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రఫీ వృత్తి మరింత అభివృద్ధి చెందాలని, ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

**గంట రవి కిరణ్ కుటుంబానికి మందమర్రి ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక సహాయం**

**మందమర్రి ఆగస్టు 19 (నేటి మనదేశమ్):** మందమర్రి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శాశ్వత సభ్యులు కీ.శే. గంట రవి కిరణ్ 11వ రోజు పెద్దకర్మ కార్యక్రమానికి అసోసియేషన్ ప్రతినిధులు హాజరై, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అసోసియేషన్ తరఫున రూ.12,700/- (పన్నెండు వేల ఏడు వందల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కష్టకాలంలో సభ్యుల కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడం తమ బాధ్యత అని అసోసియేషన్ నాయకులు తెలిపారు.



ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లకొండ కనకయ్య గౌడ్, పట్టణ అధ్యక్షులు పసుల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్ కుమార్, కోశాధికారి బద్రి సతీష్, గౌరవ సలహాదారు జాడి ముకుందం, ఉపాధ్యక్షులు ఆర్. సుజిత్, మాజీ ఉపాధ్యక్షులు కామెర గణేష్, విక్రరీ అశోక్, కామెర మహేందర్, కార్యనిర్వాహక కార్యదర్శి పగిడి రాజలింగు, సభ్యులు సంభోరు మనోజ్, ఐవూక్స్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంట రవి కిరణ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# మందమర్రి యువత చేతుల్లోనే భవిష్యత్. ఉద్యోగమే లక్ష్యం కావాలి.- మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ



**మందమర్రి ఆగస్టు 19 (నేటి మనదేశమ్):** మందమర్రి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పోటీ పరీక్షల్లో విజయవంతంగా నిలబెట్టడం తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఆర్థిక పరిస్థితులు ప్రతిభకు అడ్డంకి కాకూడదు.. ప్రతి పేద విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగం సాధించే స్థాయికి ఎదగాలి.అనే లక్ష్యంతో కాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మందమర్రిలో ఏర్పాటు చేసిన.కాకా ఫ్రీ కోచింగ్ సెంటర్‌ను.మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ ప్రారంభించారు.పేదరికం అడ్డంకి కాదు.. ప్రతిభే ఆయుధం.మంత్రి వివేక్.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.పేద, మధ్యతరగతి కుటుంబాల యువతకు ఖరీదైన కోచింగ్ భారం కాకూడదనే ఉద్దేశంతో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కల ఉన్న ప్రతి యువతికి ఈ కేంద్రం ఒక బలమైన వేదికగా నిలవాలని. ఆకాంక్షించారు.ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు అందుబాటులో ఉన్న శిక్షణను పూర్తిస్థాయిలో వినియోగించుకుని పట్టుదలతో చదవాలని సూచించారు. అవకాశం మీ ముందుకు వచ్చింది.ఇక విజయాన్ని మీ కష్టంతో సాధించాలి.అని యువతకు మంత్రి దిశానిర్దేశం చేశారు.మందమర్రి నుంచి అత్యధిక సంఖ్యలో ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఎంపికై రాష్ట్రస్థాయిలో ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నైపుణ్యాభివృద్ధి, ప్రత్యేక శిక్షణ, ఉద్యోగ అవకాశాల అనుసంధానం ద్వారా యువత భవిష్యత్తుకు బలమైన మార్గం చూపుతున్నామని తెలిపారు.కేసులు కాదు. కెరీర్ కావాలి.ఎంపీ వంశీకృష్ణ.ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ. తెలంగాణ సాధనలో.నీళ్లు, నిధులు, నియామకాలు" ప్రధాన ఆకాంక్షలని, యువతకు నియామకాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన బాధ్యతల్లో ఒకటని.అన్నారు.యువత భవిష్యత్తును దెబ్బతీసే రాజకీయ వ్యాఖ్యలకు దూరంగా ఉండి, వారి కెరీర్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. యువతకు కేసులు కావాలా? ఉద్యోగాలు కావాలా? మీ భవిష్యత్తును మీరే నిర్ణయించుకోవాలి" అని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు.విదేశీ భాషలు నేర్చుకుని అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగాలు సాధించడం కూడా యువతకు మంచి అవకాశమేనని అన్నారు. తెలంగాణ యువత విదేశాలకు వెళ్లి మంచి ఉద్యోగాలు సాధించకూడదా?.అని ప్రశ్నించారు.మంత్రి వివేక్ వెంకటస్వామి చొరవ తోద్వారా తెలంగాణ యువతకు విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని.ఎంపీ తెలిపారు. ప్రభుత్వ శాఖలు, కాకా ఫౌండేషన్ అందిస్తున్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని తమ జీవితాలను మార్చుకోవాలని పిలుపునిచ్చారు.మందమర్రి నుంచి ఉద్యోగ విజయాల పరంపర రావాలి.ఒక కోచింగ్ సెంటర్ ప్రారంభం కావడం మాత్రమే కాదు. ఇక్కడి నుంచి వందలాది మంది యువత ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే లక్ష్యం.అని నాయకులు పేర్కొన్నారు.కలలు కనడమే కాదు. లక్ష్యాన్ని పెట్టుకోవాలి. లక్ష్యాన్ని పెట్టుకోవడమే కాదు.కష్టపడాలి. కష్టపడడమే కాదు. విజయం సాధించాలి. మందమర్రి యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ విజయాల పరంపర సృష్టించాలని మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అధికారులు, కాకా ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, యువత, పోటీ పరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

**- ఆరుగురిపై కేసు నమోదు**

**- రూ.9 వేల నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం**




**సిరిసిల్ల, ఆగస్ట్ 19: నేటి దేశమ్ ప్రతినిధి** సిరిసిల్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. ఆర్టీసీ కార్ వాషింగ్ సెంటర్ వద్ద ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పేకాట ఆడుతున్న ఆరుగురిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9 వేల నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను సిరిసిల్ల పట్టణ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశారు.టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో సిబ్బంది పాల్గొన్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ నటేష్ వివరాలు వెల్లడించారు.నిందితులలో వొల్లాల రమేష్ (47), పెరాల కరుణాకర్‌రావు (52), నమిలికొండ నర్సయ్య (41), ముత్యాల అఖిల్ (34), మెరుగు లక్ష్మణ్ (48), గుండా సంతోష్ (43)పై కేసు నమోదు చేశారు.జిల్లాలో పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వాటికి స్థావరాలు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

# పోలీసు అధికారుల సంఘం నూతన కార్యవర్గానికి ఎస్పీ అభినందనలు



**రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 19: నేటి మన దేశమ్ ప్రతినిధి** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల ఎన్నికైన నూతన పోలీసు అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేష్ బి. గితేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి మొక్కలను అందజేశారు.ఎన్నికల నోడల్ అధికారి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు నూతన కార్యవర్గ సభ్యులను ఎస్పీకి పరిచయం చేశారు. అధ్యక్షుడిగా గోపాల్, ఉపాధ్యక్షులుగా ఇన్‌స్పెక్టర్ రవి, ఎస్ఐ వెంకట్రాజం, కార్యదర్శిగా ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా శ్రీనాథ్‌రాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రకాష్, కోశాధికారిగా వేణు ఎన్నికయ్యారు.ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా గోపాల్, శ్రీనివాస్, సుధాకర్, పద్మ, మహేష్, తిరుపతి, కో-ఆప్షన్ సభ్యులుగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, మహిళా కానిస్టేబుల్ ప్రియాంక ఉన్నారు.నూతన కార్యవర్గ సభ్యులకు ఎస్పీ అభినందనలు తెలిపారు. పోలీసు సిబ్బంది సమస్యలపై తక్షణమే స్పందించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సిబ్బందికి అండగా నిలుస్తూ స్ఫూర్తిదాయకంగా పనిచేయాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, నూతన పోలీసు అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**ఆసిఫాబాద్, ఆగస్టు 19 (నేటి మనదేశమ్):** నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి విడత ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు, పురపాలక సంఘాల కమిషనర్లతో ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో పురోగతి, 2వ విడత జాబితాపై జూన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో జిల్లాలో 8 వేల 851 ఇండ్లు మంజూరయ్యాయని, ఇంకా 1 వేయి 100 ఇండ్ల పనులు ప్రారంభం కాలేదని, ఇందుకు గల కారణాలను నివేదిక రూపంలో సమర్పించాలని, వెంటనే ఇండ్ల పనులు ప్రారంభించాలని తెలిపారు. బేస్మెంట్, రూఫ్, స్లాబ్ లెవెల్ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, నిర్మాణ పనులలో పురోగతి సాధించాలని తెలిపారు. 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఏ ఒక్క అనర్హులు ఉండకూడదని, అర్హులు మాత్రమే జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. గుడిసెలలో నివసించే వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కోసం అనేక దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల పేర్లను గ్రామ సభ నిర్వహించి తీర్మానాలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, మున్సిపాలిటీలలో రూఫ్ బలంగా ఉండి పైన స్లాబ్ వేసుకునే అర్హులైన వారిని గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రకాష్ రావు, మేనేజర్ పుష్పలత, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఎ. ఈ.లు తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల అభివృద్ధికి చర్యలు ..జిల్లా కలెక్టర్ కె.హరిత




**ఆసిఫాబాద్, ఆగస్టు19(నేటి మనదేశమే ప్రతినిధి)::**ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు అందిస్తున్న బోధన, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన నిర్వహణ కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల గిరిజన పిల్లల భవిష్యత్తును బంగారుమయంగా మార్చే విద్యాలయమని తెలిపారు. విద్యార్థులు గ్రామీణ, మారుమూల ప్రాంతాల నుండి ఎక్కువగా ఉన్నారని, స్టేట్ సిలబస్ నుండి సి.బి.ఎస్.ఈ. సిలబస్ కు మారి క్రమంలో కొంత ఇబ్బంది ఉంటుందని, విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో వారికి అర్థమయ్యే రీతిలో బోధించి ఆంగ్లంలో పట్టు సాధించేలా నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా అధ్యాపకులు పర్యవేక్షించాలని, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు అందుతున్న బోధన పై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకోవాలని అన్నారు. విద్యార్థులకు మాతృభాష నుండి ఆంగ్ల మాధ్యమానికి సులభంగా మారేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, నిరంతరంగా హాజరు పర్యవేక్షించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. విద్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, తరగతిలో విద్యార్థికి అనారోగ్యం ఉండి, చదువుపై దృష్టి సారించలేకపోతున్న విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని తెలిపారు. విద్యాలయం అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, విద్యాలయ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయుడు దేవులపల్లి రామలింగం కన్నుమూత

**రాజమహేంద్రవరం, ఆగస్టు 19 (నేటి మనదేశమ్):** సుమారు నాలుగు దశాబ్దాల పాటు జర్నలిజానికి అంకితమై పనిచేసిన సీనియర్ పాత్రికేయుడు, వెలుగు పత్రిక సంపాదకుడు దేవులపల్లి రామలింగం (60) మంగళవారం కాకినాడలోని ఓ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కిర్కంపూడిలో జన్మించిన రామలింగం 1985లో ఆంధ్రభూమిలో



పాత్రికేయ వృత్తిని ప్రారంభించారు. అనంతరం డెక్కన్ క్రానికల్లో 1998 వరకు పనిచేశారు. తరువాత ఉదయం దినపత్రికలో స్టాఫ్ రిపోర్టర్‌గా చేరి మహబూబ్‌నగర్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పనిచేశారు.2002లో రాజమహేంద్రవరంలో వెలుగు పత్రికను ప్రారంభించి, అప్పటి నుంచి సంపాదకుడిగా కొనసాగారు. సూటిగా మాట్లాడే తత్వం, నిరాడంబర జీవనం, ధైర్యం, విస్తృత పరిజ్ఞానం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి.జర్నలిజం కోసం తన వ్యక్తిగత ప్రయోజనాలను త్యజించిన రామలింగం, తన పూర్వీకుల ఆస్తిని సైతం పత్రిక నిర్వహణకు వినియోగించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడారు. సంపద కూడబెట్టకుండా పత్రికా రంగానికే తన జీవితాన్ని అంకితం చేశారు.ముద్రగడ పద్మనాభం, జక్కంపూడి రామ్మోహన్‌రావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితర ప్రముఖులతో ఆయనకు సన్నిహిత పరిచయాలు ఉన్నాయి.రామలింగం మృతికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు.నిరాడంబరత, నిజాయితీ, ధైర్యం, నిస్వార్థ సేవకు ప్రతీకగా నిలిచిన రామలింగం మరణం తెలుగు జర్నలిజం రంగానికి తీరని లోటని సహచర పాత్రికేయులు పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిన్న, మధ్యతరహా దినపత్రికల సంఘం దేవలపల్లి రామలింగం మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శ్రీ కె.ఎస్. రంగసాయి మాట్లాడుతూ, శ్రీ రామలింగం దశాబ్దాలుగా సంఘంతో అనుబంధం కలిగి ఉన్నారని, పలు సంవత్సరాలు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా సేవలు అందించారని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ శ్రీ రామలింగం మరణం సంఘానికి తీరని లోటని , సంఘం తరఫున వారి కుటుంబానికి సంతాపం తెలియజేస్తున్నామని ఆయన అన్నారు.

# ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం..

**-టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి ,ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**అదిలాబాద్ ఆగస్టు 19 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** పేదల సొంత ఇంటికలను ఇందిరమ్మ పథకం ద్వారా సాకారం చేస్తుందని అన్నారు.కరంజి గ్రామానికి చెందిన బిక్కి లక్ష్మి - గంగన్న దంపతులకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయగా,బుధవారం గృహప్రవేశ వేడుకలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిథులు నూతన గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని,ఎవరు ఆందోళన చెందవద్దని ప్రజలకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు వెంకట,తుడం వినోద్,సుదర్శన్,వినోద్,జగదీశ్ రెడ్డి,పోత రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# సరైన పత్రాలు లేని 165 వాహనాలు స్వాధీనం- డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి



**అదిలాబాద్ ఆగస్టు 19 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం,నేరాల నియంత్రణ,ప్రజలతో పోలీసుల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా బుధవారం జిల్లా కేంద్రంలోని తిరుపల్లి,ఖిల్లా ఏరియాలలో ఎస్పీ అఖిల్ మహాజన్,ఆదేశాలు మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని తెల్లవారుజామున నుంచి నిర్వహించినట్లు డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా 179 ద్విచక్ర వాహనాలు,5 ఆటోలు,1 కార్,స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఆసాంఘిక,చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.నిబంధనలు ఉల్లంఘించిన కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి ఎం వెంకట నర్సయ్య ,ఏఆర్ డిఎస్పి కమతం ఇంద్ర వర్ధన్,సిఐలు బి సునీల్ కుమార్,బి ప్రణయ్ కుమార్,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి వెంకటి,టి.మురళి,ఎన్ చంద్రశేఖర్,ఎస్సైలు,రిజర్వ్ సిబ్బంది,పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా విలేకరుల కు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ



**వనపర్తి ఆగస్టు19: నేటిమనదేశమ్ ప్రతినిది** బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవశీ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఫోటో జర్నలిస్ట్ విలేకరుల తో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీత రెడ్డి పాల్గొన్నారు ఈసందర్భంగా కేక్ కట్ చేసి ఫోటో జర్నలిస్టు విలేకరుల కు ఎస్పీ శుభాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ ఆ ర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, డిసిఆర్బి డిఎస్పి, బాలాజీ నాయక్, వనపర్తి సీఐ సుగంధ రత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, అన్ని పత్రికల ఫోటో జర్నలిస్టు విలేకరులు, రాము, బాలరాజు, యూసుఫ్ యాదిరెడ్డి, లోకేష్, శ్రీకాంత్, మహేష్ ఆంజనేయులు, జ్ఞానమూర్తి వినోద్ తదితరులు పాల్గొన్నారు

# అయోధ్య వాసవి ఆర్యవైశ్య ఫౌండర్ ను సన్మానం చేసిన పూరి



**వనపర్తి ఆగస్టు 19 నేటి మనదేశమ్ ప్రతినిది** ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సెక్రటరీ మల్లికార్జున్ అయోధ్య ఆర్యవైశ్య సత్రం ఫౌండర్ హారి నాద్ గుప్త ఎల్ వి కుమార్ ను సన్మానం చేశామని పూరి సురేష్ తెలిపారు

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com